





హర్ ఘర్ తిరంగా

మీకు..మేమున్నాం..



రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో హోం మంత్రి అనిత సోమవారం పర్యటించారు.. సెంట్రల్ జైలు అధికారులు ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను ప్రారంభించి.. మహిళా ఖైదీలతో ముచ్చటించారు. త్వరలోనే క్షమాభిక్ష పెడతామని తీపికబురు చెప్పారు. - వివరాలు మెయిన్‌లో

సెట్టు.. నిలబడేటట్టు..



సినిమా చెట్టును బతికించడానికి ప్రయత్నాలు ఆరంభమయ్యాయి. పది రోజుల కిందట కొవ్వూరు మండలం కుమారదేవంలోని సినిమా చెట్టు నేలవాలింది. ఆ చెట్టును బతికిస్తామని ఒక సంస్థ ముందు కొచ్చింది..సోమవారం చెట్టు పునరుజ్జీవం పనులు ఆరంభించారు.. - వివరాలు 7లో

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 12 : ఆజాదీకా అమృత్ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో సోమవారం జెండా పండుగను ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండా పాయింట్‌లో కలెక్టర్ ప్రశాంతి సెల్ఫీ ఫొటో దిగారు. కాన్వా‌స్‌పై కలెక్టర్ పి.ప్రశాంతి, ఇన్‌చార్జి జేసీ నరసింహరావు సంతకాలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ మంగళవారం ఉదయం రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల నుంచి ఆనంకళాకేంద్రం వరకు జెండా ర్యాలీ నిర్వహించే ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లావ్యాప్తంగా ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలన్నారు. హర్ ఘర్ తిరంగా యాత్రలు ,తిరంగా కచేరీలు,తిరంగా ప్రతిజ్ఞ చేయాలన్నారు. జెండాను ఎగురవేసి సెల్ఫీ తీసుకుని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని పిలుపునిచ్చారు.



అమ్మా..నాన్న జాగ్రత్త!

అమ్మాయిల చేయి వదలొద్దు..

- ప్రలోభాల్లో చిక్కుకుపోతున్నారు..
- తల్లిదండ్రులను వదిలేస్తున్న వైనం
- పెరుగుతున్న అదృశ్యం కేసులు
- ఐదేళ్లలో 188 మంది మిస్సింగ్
- మీ చుట్టూ తిరుగుతున్న మోసగాళ్లు
- పిల్లలపై ఒక కన్నేసి ఉంచాల్సిందే

అమ్మా నాన్న జాగ్రత్త.. అమ్మాయిల చేయి విడవొద్దు.. మహా మాయగాళ్లు ఉన్నారు..! కనిపెట్టుకుని ఉండండి.. కంటికి రెప్పలా కాపాడుకోండి.. లేదంటే మీ కళ్లెదుటే మోసం చేసేస్తారు.. మీకు తెలియకుండానే ఎత్తుకుపోతారు.. ధవళేశ్వరంలో పది రోజుల కిందట వెలుగు చూసి న ఒక సంఘటనే అందుకు ఉదాహరణ..భర్త అండ లేని ఒక మహిళను అక్కా అంటూ దగ్గరయ్యాడు.. ఆమె కూడా అలాగే భావించింది..అయితే తన ఇద్దరి కుమా ర్తెలపై కన్నేసి దగ్గరయ్యాడని మాత్రం అనుకోలేదు. ప్రస్తుతం అతడి నిజస్వరూపం తెలిసి లబోదిబోమంటుంది. ఆ తల్లికి వచ్చిన కష్టం ఎవరికీ రాకూడదంటే తస్మాత్ జాగ్రత్త.. అన్ని రోజులు మనవి కాదు కదా..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

అభూత కల్పనలను నిజమని నమ్ముతున్నారు. మాయ మాటలకు లొంగిపోతున్నారు.సెల్‌ఫోన్‌లో రంగుల ప్రపంచాన్ని కళ్ల ముందుకు తెచ్చేస్తానంటున్న కేటుగాళ్ల వలలో చిక్కుతున్నారు.చివరికి తల్లిదండ్రులను ఆవేదనలోకి నెట్టి 'వాడి'తో దూరమవుతున్నారు. కొద్ది రోజులకే ఊహించుకున్న రంగుల లోకం పటాపంచలు కావడంతో జీవచ్ఛవాల్లా మిగిలిపోతున్నారు.ఇలా ఎందరో బాలికలు కేటుగాళ్ల కూపంలో చిక్కుతూ తల్లిదండ్రులను శోకసంద్రంలో ముంచేస్తున్నారు.తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిక్షణం గమనిస్తూ ఉండడమే విరుగుడుగా కనిపిస్తోంది. పోలీసులు అదే హెచ్చరిస్తుండడంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

తల్లిదండ్రుల అప్రమత్తతే శ్రీరామరక్ష

పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు,ముఖ్యంగా బాలలైతే తల్లి నిఘా కచ్చితంగా ఉండాలి. సాధారణంగా 8వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ ఉరకలు వేసే వయసు 'తప్పు' చేసే అవకాశం ఎక్కువ. అందువల్ల తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి.స్నేహ పూర్వకంగా మాట్లాడాలి. పిల్లలు స్కూల్స్, కాలే జీలకు వెళ్లి వస్తున్నప్పుడు గమనించాలి. వారి తీరుపై తరచుగా చదివే చోట ఆరాతీయాలి.ట్యూషన్ల విషయంలో అప్రమత్తత అవసరం. ధవళేశ్వరం ఇద్దరు బాలికల కేసు ఇందుకు ఉదాహరణ. వారిని వెంట బెట్టుకొని తీసుకెళ్లిన యువ కుడు విజయ నగరం జిల్లాలోని ఓ ఊర్లో ట్యూషన్లు చెప్పేవాడు. అక్కడ ట్యూషన్‌కి వచ్చే ఓ బాలికను మా యమాటలు చెప్పి తీసుకొచ్చేశాడు. పిల్లల ప్రతి క్షణాన్నీ గమనిస్తూ ఉండాలి. విలాసాలకు అలవాటు చేసే ముందు బాధ్యతలను తెలియజేయాలి.పిల్లల అలవాట్లు, సెల్‌ఫోన్ వాడకం, ప్రవర్తనల, హెయిర్ కటింగ్‌లపై కచ్చి తంగా దృష్టి పెట్టాలి.సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచే ప్రయత్నం చేయాలి.ఒకవేళ ఇవ్వాల్సి వస్తే నిఘా ఉంచాలి.

ఎందుకిలా?

గత వైసీపీ ప్రభుత్వంలో మిస్సింగ్ కేసులపై పూర్తి ఉదాసీనంగా వ్యవహరించడంతో పోలీసులు పెద్దగా శ్రద్ధ చూపించలేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, నిగ్గు తేలుస్తామని పవన్ కల్యాణ్ ప్రకటించడంతో తల్లిదండ్రులకు పెద్ద ఊరట లభించింది.అయితే మిస్సింగ్ కేసుల్లో పోలీసుల తీరు మాత్రం నేటికీ మారలేదని పరిస్థితులు చెబుతున్నాయి.కూటమి ప్రభుత్వం వచ్చాక రెండు కేసులు పరిశీలిస్తే ఈ విషయం రూఢీ అవుతుంది. నెల కిందట.. ఓ తల్లి పవన్ కల్యాణ్ దగ్గరకు వెళ్లారు. తన కూతురు 9 నెలల నుంచీ కనిపించడం లేదని..పోలీసులు అప్పటి నుంచీ దర్యాప్తు చేస్తున్నామనే చెబుతున్నారని తెలిపారు. పవన్ ఆదేశాలతో ఎక్కడో జమ్మూలో ఉన్న ఆ యువతిని పోలీసులు కేవలం రెండు రోజుల్లో తల్లి చెంతకు చేర్చారు. అలాగే.. ఇద్దరు బాలికలతో ఓ కేటుగాడు ఉడాయించాడు. ఆ తల్లి గత నెల 29న పోలీసులకు ఫిర్యాదు చేసింది. తర్వాత కేసులో పురోగతి లేదు. ఆమె నాలుగు రోజుల కిందట పిఠాపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వర్మ వద్దకు వెళ్లి విన్నవించింది.అప్పుడు దర్యాప్తు పరుగు పెట్టింది.రెండు రోజుల్లో బాలికల ఆచూకీని పోలీసులు పట్టేశారు.ఆ యువకుడిని కటకటాల వెనక్కి నెట్టారు. ఈ ఘటనలు పరిశీలిస్తే.. ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లి గోడు వెళ్లబోసుకున్న వారివిషయంలోనే వేగంగా న్యాయం దొరుకుతున్నట్లు స్పష్టమవుతోంది.మిస్సింగ్ కేసులను పోలీసుల ఒకే గాటన కట్టేస్తుండడం వల్ల ఇబ్బంది ఎదురవుతోంది.

188 మంది ఏమయ్యారో..

రక్షణగా ఉండాల్సిన వ్యవస్థలు అందరినీ ఒకే గాటన కట్టేసి దర్యాప్తుల్లో జాప్యం చేయడం వల్ల చాలా మంది ఏ కూపంలో కూరుకుపోయారో ఇప్పటికీ సమాధానం లేని ప్రశ్నగానే మిగిలిపోయింది. పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల కంటే రెండింతలు వెలుగు చూడని ఘటనలు ఉంటాయని చెబుతున్నారు. 2016 నుంచీ మిస్సింగ్ కేసులు పరిశీలిస్తే.. ఉమ్మడి, విభజిత తూర్పుగోదావరి జిల్లాలో బాలలు 21, బాలి కలు 70 మంది అదృశ్యమయ్యారు.గడిచిన ఐదేళ్లలో 18 మంది బాలికలు,170 మంది యువతుల ఆచూకీ లేదు. తాజాగా జరిగిన ఈ కేసు చూస్తే తప్పెవరిది? అనే ప్రశ్నకు పిల్లల చేయి వదిలేయడమే అనే సమాధానం వినవస్తోంది. ధవళేశ్వరంలో ఇద్దరు బాలికలను తనతో తీసుకెళ్లిపోయిన యువకుడి కేసు తల్లిదండ్రులకు తాజా హెచ్చరికను చేస్తోంది.ఓ గుర్తు తెలియని వ్యక్తి, అంతకు ముందు ఎన్నడూ చూడలేదు. రైల్వే ఉద్యోగమంటూ అబద్ధాలు చెప్పాడు.అప్పటికే తన కుమార్తెలు 'ఈడు'కు వచ్చారన్న సోయ కూడా ఆ తల్లిలో లేదు. వాడి మాయమాటలకు బుట్టలో పడింది.ఉద్యోగం వస్తే ఆర్థిక పరిస్థితి కొంత మెరుగు పడుతుందని ఆశ పడింది.ఈ క్రమంలో ఆ కేటుగాడు ఆ ఇద్దరు బాలిక లనూ అపహరించాడు. తన కూతుళ్ల విషయంలో కేటుగాడి ప్రవర్తను ఆ తల్లి పసిగట్టి అప్రమత్తమయితే ప్రమాదం ముంచుకొచ్చేది కాదు. ఇప్పుడు ఎవరికీ 'చెప్పుకోలేని' పరిస్థితి ఆ బాలికలకు దాపురించింది.

పిల్లల ప్రవర్తన గమనిస్తుండాలి



పిల్లల ప్రవర్తన..ముఖ్యంగా బాలికల తీరును తల్లి దం డ్రులు కచ్చితంగా గమనిస్తూ ఉండాలి. పిల్లలకు సెల్ ఫోన్ ఇస్తే నిఘా కచ్చితంగా ఉండాలి. బాలలపై కూడా దృష్టి సారించాలి. ఆడపిల్లలు ఒకవేళ ఎవరి ట్రాప్‌లో అయినా ఉన్నారని తల్లిదండ్రులు గమనిస్తే వెంటనే వారిని దగ్గరకు తీసుకొని స్నేహ భావంతో మాట్లాడాలి. మాట వినకపోతే పోలీసులకు విషయం చెప్పాలి.మేం ఆ పిల్లలకు కౌన్సెలింగ్ ఇస్తాం. వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం. స్కూలు యాజమాన్యాలు పిల్లలకు నైతిక విలువలు, మంచి నడవడిక గురించి నూరిపోస్తూ ఉండాలి. అందరం కలిసి పిల్లలను రక్షించుకుందాం.

- డి.నరసింహ కిషోర్, ఎస్పీ, తూర్పుగోదావరి.

కేటుగాడు.. అరెస్టు

- మెయిన్‌లో..

జిల్లాలో పెరుగుతున్న హెచ్ఐవీ కేసులు

అంతర్జాతీయ యువజనోత్సవంలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, ఆగస్టు 12 : అంటువ్యాధులు లేకుండా నిర్మూలిద్దామని కలెక్టర్ పి.ప్రశాంతి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యువజనోత్సవంలో భాగంగా రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో సోమవారం హెచ్ఐవీపై మీకోసం చైతన్యం,డీ వార్మింగ్ డే కార్యక్రమాల పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు.సోమవారం నుంచి అక్టోబరు 13వ తేదీ వరకు 8 వారాల పాటు హెచ్ఐవీపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఆగస్టు 20న డీవార్మింగ్ డేను పురస్కరించుకుని అన్ని పాఠశాలల్లో విద్యార్థులు మధ్యాహ్నభోజన సమయంలో అల్బెండాజోల్ మాత్రలు వేసుకునేలా చూడాలన్నారు. ఈ రెండు కార్యక్రమాలపై ప్రజల్లో చైతన్యం తేవాలన్నారు. ఈ నెల 28న మరోసారి మిగిలిన పిల్లలకు అల్బెండాజోల్ మాత్రలు అందించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 1 నుంచి 19 ఏళ్ల వయస్సు కలిగిన వారు 4,30,339 మంది ఉన్నట్టు తెలిపారు. హెచ్ఐవీ ప్రభావం తక్కువగా ఉన్నప్పటికీ జిల్లాలో కేసుల నమోదు ఎక్కువగా ఉందన్నారు. దేశంలో 2030 నాటికి హెచ్ఐవీ, ఎయిడ్స్ , ఇతర అంటువ్యాధులను అంతం చేయాలనే లక్ష్యంతో కార్యాచరణ సిద్ధం చేసినట్టు తెలిపారు. 1097 హెచ్ఐవీ హెల్ప్‌లైన్ నెంబర్ అన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి జేసీ జి.నరసింహులు, డీఎంహెచ్‌వో కే.వెంకటేశ్వరరావు, ఎన్.వసుంధర తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మికుల గుర్తింపునకు ప్రత్యేక డ్రైవ్

నల్లజర్ల,ఆగస్టు 12 : బాలబాలికలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని నిడదవోలు అసిస్టెంట్ లేబర్ అధికారి(ఏఎల్‌వో)పి.శాంతిరాజు హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నల్లజర్లలో స్పెషల్ టీం (రాజమహేంద్రవరం పోలీసులు, లేబర్ అధికారులు)నల్లజర్ల మండలంలో సోమవారం విస్తృత తనిఖీలు చేశారు. నెల రోజులపాటు స్పెషల్ డ్రైవ్ ఉంటుందని తెలిపారు. 18 సంవత్సరాల్లోపు పిల్లలను పనిలో పెట్టుకున్న సంస్థల యాజమానులపై కేసులు నమోదు చేసి కోర్టుకు పంపిస్తామన్నారు. నల్లజర్లలో 3 కేసులు నమోదు చేశారు.వారి వెంట ఎస్ఐ వాణి ఉన్నారు.

ఆ ఘనులెవరో! 7

ఎవరి పని.. వారిదే!



ఇదీ సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలోని చిత్రం.. ఈ చిత్రంలో ఫోన్‌లు చూస్తున్నవారు.. నిలబడి మాట్లాడుకుంటున్నవారు ఎవరో తెలుసా.. వీరంతా అర్జీదారులు కాదండోయ్.. జిల్లాస్థాయి అధికారులేనండి.. కలెక్టర్ రాకపోవడంతో ఎవరిష్టం వారిది.. ప్రతి సోమవారం ఇంతే.. ప్రభుత్వం మారినా పాత వాసనలు ఇంకా పోవడంలేదు మరి..!

కలెక్టర్ లేకపోతే అర్జీదారులను పట్టించుకోని అధికారులు

- మారని ఉన్నతాధికారుల తీరు
- ప్రజల సమస్యలపై చిన్నచూపు
- కలెక్టర్ ఉంటేనే శ్రద్ధ..లేదంటే అశ్రద్ధే
- ఇదీ ప్రజా సమస్యల పరిష్కారవేదిక తీరు
- కలెక్టరేట్‌లో 187 అర్జీల స్వీకరణ



కలెక్టర్ కోసం ఎదురు చూస్తున్న అర్జీదారులు

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, ఆగస్టు 12 : ప్రభుత్వం మారినా పాత వాసన పోలేదు.కొన్ని విధానాల్లో మార్పులు రాలేదు. ఇంకా పాత విధానంలోనే ప్రభుత్వ కార్యక్రమాలు జరుగుతున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి స్పందన స్థానంలో ప్రజాసమస్యల పరిష్కారవేదిక మీ కోసం కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుంది. అయితే అధికారుల తీరులో మాత్రం మార్పుకాన రావడం లేదు. వచ్చామా..వెళ్లామా అన్నట్టే ఉంటున్నారు. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం జరిగే ప్రజాసమస్యల పరిష్కారవేదిక తీరు పలు విమర్శలకు తావిస్తోంది.జిల్లా కలెక్టర్ స్వయంగా అర్జీలు స్వీకరించినప్పుడు ఉన్న అప్రమత్తత ఆమె లేని సమయాల్లో కానరావడం లేదు. ఉన్నతాధికారులు స్వయంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించినా ఆ సీరియస్‌నెస్ కనిపించడంలేదు.

సిట్టింగ్ అయోమయం

ప్రజాసమస్యల పరిష్కారవేదిక నిర్వహించే హాలులో అధికారులు కూర్చునే సిట్టింగ్ అయోమయంగానే ఉంటుంది. గతంలో కూడా ఇదే పరిస్థితి. ఏ అధికారి ఎక్కడ ఉన్నారో స్పష్టంగా తెలిసేలా ఆయా ప్రభుత్వ శాఖల నేమ్ బోర్డులను వారి టేబుల్స్‌పై ఏర్పాటు చేస్తే ఏ శాఖ అధికారులు ఎంత మంది వచ్చారనేది స్పష్టంగా తెలుస్తుంది. కానీ కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం అధికారులు, సిబ్బంది మూకుమ్మడిగా హాలులో కూర్చోవడం. ఏఏ శాఖలు వచ్చాయో ఆఖరిలో రిజిస్టర్ చూస్తే గాని తెలియని పరిస్థితులు ఉన్నాయి. కలెక్టర్ కూడా జిల్లాస్థాయి అధికారులను పిలిచేటప్పుడు హాలులో ఎటు కూర్చున్నారో తెలియక అటు ఇటు చూసి పిలవడం జరుగుతుంది.ఈ పరిస్థితి లేకుండా విభాగాల వారీగా సిట్టింగ్‌లు ఏర్పాటు చేసి ఆయా శాఖల టేబుల్ బోర్డులను ఏర్పాటు చేస్తే అయోమయం ఉండదనే వాదన వినిపిస్తోంది

187 అర్జీల స్వీకరణ

ప్రజాసమస్యల ఫిర్యాదుల పరిష్కారం దిశగా క్షేత్రస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని.. ప్రజల నమ్మకాన్ని పెంచే దిశగా అధికారుల పనితీరు ఉండాలని కలెక్టర్ ప్రశాంతి సూచించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై జూమ్ యాప్ ద్వారా డివిజన్ ,మండల అధికారులతో చర్చించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదికలో 187 అర్జీలను స్వీకరించారు. తొలుత జిల్లా ఇన్‌చార్జి జేసీ, డీఆర్‌వో నరసింహరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. నిడదవోలుకు చెందిన కారింకి వెంకన్నకు చెందిన సర్వే నెం 142/8 కొత్త సర్వేనెంబరు 890/5లో భూమిలో వారి కుమారులు 50 ఏళ్లుగా సాగుచేసుకుంటుండగా చెరుకు శ్రీనివాస్ తమ భూమిపై లేనిపోని పిటిషన్లు పెట్టి బెదిరిస్తున్నాడని అతని బారి నుంచి రక్షణ కల్పించాలని అర్జీపెట్టుకున్నారు. వీరితో పాటు నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు కలెక్టరేట్‌కువచ్చి అధికారులతో మాట్లాడి బాధితులకు న్యాయంచేయాలని తెలిపారు. దివ్యాంగ బ్యాగ్ లాగ్‌పోస్టుల భర్తీ, చేతి వృత్తుల వ్యాపారం చేసే దివ్యాంగుల బ్యాంకు రుణాలకు చర్యలు తీసుకోవాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు యనమదల వెంకటేశ్వరావు, జిల్లా అధ్యక్షుడు అంగర గంగారామ్ విజ్ఞప్తి చేశారు. సీతానగరం మండలం రాపాక-చినకొండేపూడి గ్రామాల మధ్య పుంతరోడ్డు కబ్జాకు గురైందని.. వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరారు. ప్రజాసమస్యల పరిష్కారవేదికలో రెవెన్యూ విభాగానికి 71, పోలీస్ శాఖకు 30, పౌరసరఫరాల శాఖకు 26 ,పంచాయతీరాజ్ 25, ఇతర శాఖలకు 35 అర్జీలు వచ్చాయి.



కలెక్టర్ రావడంతోనే చుట్టుముట్టిన అర్జీదారులు

కలెక్టర్ లేకపోతే అర్జీదారులు వెనక్కు.

కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కారవేదికలో కలెక్టర్ పి.ప్రశాంతి పాల్గొంటేనే నేరుగా అర్జీలు ఇవ్వడానికి ప్రజలు సముఖత వ్యక్తం చేస్తున్నారు. అనివార్య కారణాల వల్ల కలెక్టర్ హాజరుకాకపోతే ప్రజలు ఉన్నతస్థాయి అధికారులకు అర్జీలు ఇవ్వడానికి ఇష్టపడడం లేదు.కలెక్టర్ రిసీవింగ్, సమస్య క్షుణంగా పరిశీలన చేయడం సంబంధిత అధికారులతో వెంటనే మాట్లాడటం, ప్రజలకు స్పష్టమైన హామీ ఇవ్వడంతో ప్రజలు కలెక్టర్‌నే స్వయంగా కలవడానికి ఇష్టపడుతున్నారు. రాజమహేంద్రవరంలో సోమవారం హోంమంత్రి పర్యటన నేపథ్యంలో కలెక్టర్ అధికారిక కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లడంతో ప్రజాసమస్యల పరిష్కారవేదికకు ఉదయం హాజరుకాలేదు.మధ్యాహ్నం తర్వాత కలెక్టర్ నేరుగా కలెక్టరేట్‌కు వచ్చారు. అప్పటి వరకు కలెక్టర్ కోసం చాలా మంది ఉండిపోయారు. కలెక్టర్ ప్రశాంతిని కలిసి అర్జీలను ఇచ్చాకే ప్రజలు వెనుతిరిగారు.



సీతాకోక చిలుకమ్మా... సింగారం నీదేనమ్మా!

పచ్చని చిలుకలు తోడుంటే
పాడే కోయిల వెంటుంటే
భూలోకమే ఆనందానికి ఇల్లు....
అని ఓ సినీకవి వర్ణించినట్టు
కనిపిస్తున్నాయి కదూ ఇవి...
కానీ ఇవి చిలుకలు కాదు
సీతాకోకచిలుకలు. అల్లూరి
సీతారామరాజు జిల్లా
మోతుగూడెం పరిధిలోని పొల్లూరు
విద్యుత్ కేంద్రం వద్ద సోమవారం
ఇలా కనువిందు చేశాయి.

- మోతుగూడెం



రేపటి నుంచి వాడపల్లి వెంకన్న పవిత్రోత్సవాలు

ఆత్రేయపురం, ఆగస్టు 12: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలను గురువారం నుంచి మూడు రోజుల పాటు తిరుమల తరహాలో వైభవంగా నిర్వహించనున్నారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు సకలదోష పరిహారార్థం ఈ ఉత్సవాలను నిర్వహించనున్నారు. సంకల్పం, విశ్వక్సేన పూజ, దీక్షా ధారణ, అకల్మష హోమం, సాయంత్రం అంకురార్పణ, వాస్తు పూజలతో బుధవారం ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 15వ తేదీన ప్రధాన హోమాలు, అష్టకలశారాధన, పవిత్ర ప్రతిష్ఠ హోమాలు, పవిత్ర ఆరోహణ, 16న మహాశాంతి హోమం, ప్రాయశ్చిత్త హోమం, పూర్ణాహుతి, పవిత్ర విసర్జన, మహాదాశీర్వచనంతో ఉత్సవాలు ముగుస్తాయి. వీటికి సంబంధించి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. ఈ నేపథ్యంలో 14 నుంచి 16వ తేదీ వరకు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు, ఉపనయనాలను రద్దు చేస్తున్నట్టు ఆయన చెప్పారు.



నేడు మంత్రి నాదెండ్ల మనోహర్
కాకినాడ రాక
కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 12: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం కాకినాడ రానున్నారు. ఉదయం పది గంటలకు కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్‌మోహన్, పోర్టు, పోలీసు, కస్టమ్స్, పౌర సరఫరాలు, కార్పొరేషన్ అధికారులతో బియ్యం ఎగుమతులు, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా నియంత్రణపై సమీక్షిస్తారు.



తనకు జరిగిన మోసాన్ని డీఆర్వోకు వివరిస్తున్న బాధితుడు కృష్ణమోహన్

పెళ్లి పేరిట రూ.6 లక్షలకు టోకరా
మహిళ, మరో 11 మందిపై డీఆర్వోకు ఫిర్యాదు

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 12: పెళ్లి పేరుతో ప్రియ అనే మహిళ తనకు రూ.6 లక్షలకు టోకరా వేసిందని కాకినాడకు చెందిన కృష్ణమోహన్ కాకినాడ కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో డీఆర్వో తిప్పేనాయక్‌కు సోమవారం ఫిర్యాదు చేశాడు. ఈ వ్యవహారంలో భాగస్వాములైన 11 మందిపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. నిశ్చితార్థం రోజున తనవద్ద రూ.6లక్షలు తీసుకుని మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు. ఇలాంటి మోసాలు జరగకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో
బైక్ రైడర్ దుర్మరణం

తొండంగి, ఆగస్టు 12: కాకినాడ జిల్లా తొండంగి మండలం బెండపూడి వై.జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై సోమవారం జరిగిన ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన యూట్యూబర్, బైక్ రైడర్ పుగాకు సోంబాబు (35) దుర్మరణం పాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... హైదరాబాద్‌కు చెందిన సోంబాబు మరో ఇద్దరితో కలిసి తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఈ నెల 10న జరిగిన మిత్రుని వివాహానికి హాజరయ్యారు. అక్కడి నుంచి వారంతా విశాఖపట్నం వెళ్లి తిరిగి వస్తుండగా బెండపూడి వై.జంక్షన్ వద్ద హైవే ఎక్కుతున్న బస్సు ఢీకొనడంతో సోంబాబు తీవ్రంగా గాయపడ్డాడు. 108 అంబులెన్సులో తుని ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. తొండంగి ఎస్‌ఐ వినయ్‌ప్రతాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతుడు సోంబాబు (పాత చిత్రం)



ఆ ఘనులెవరో!

వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వందల కోట్లు దోపిడీకి గురయ్యాయి. కనీస లీజు విధానం పాటించకుండా, ఒక పద్ధతిగా వ్యవహరించకుండా దశాబ్దాలుగా గనుల వెలికితీత పనిలో నిమగ్నమైన లీజుదారులను తరిమేసి గనులను దోచేసుకోవడం గమనార్హం. వైసీపీ అరాచకాలు, ఆగడాలను తట్టుకోలేదని అనేక మంది లీజుదారులు వ్యాపారాలు వదిలేసుకున్నారు. తమ లారీలు, ఎక్సకవేటర్లు మొదలైన వాటిని అయినకాడికి అమ్మేసుకున్నారు. చాలా మంది క్రషర్లు ఆగిపోయాయి. వైసీపీ పీడ వదిలి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు.

- గనులను దోచేసిన వైసీపీ నేతలు
- గత లీజుదారులను తరిమేసి.. నిలువుదోపిడీ
- గనుల శాఖ ఉన్నతాధికారుల సహకారం
- ప్రభుత్వ పెద్దల ఇష్టారాజ్యం
- చక్రం తిప్పిన మాజీ మంత్రి అనుచరులు
- కూటమి ప్రభుత్వం రావడంతో బయటకొస్తున్న బాధితులు
- భయపడుతున్న అక్రమార్కులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

తూర్పు గోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గంలో అనేక కొండలు అదృశ్యమైన సంగతి తెలిసిందే. సీతానగరం మండలం నాగంపల్లి కొండల శ్రేణుల్లో బిల్డింగ్ మెటల్ దొరుకుతుంది. దానికి గతంలో ఓ వ్యాపారి దరఖాస్తు చేసుకున్నాడు. గత ప్రభుత్వంలో అతడిని ఇబ్బంది పెట్టి రాయలసీమ ప్రాంతానికి చెందిన ఓ మంత్రి బంధువైన నెల్లూరుకు చెందిన ఒక వ్యక్తి మధ్యలో దూరాడు. స్థానిక నేతలపై ఒత్తిడి తెచ్చి వందలాది ఎకరాల కొండలను వేలం వేయడానికి సిద్ధం చేసినట్టే చేసి తర్వాత వాటన్నింటినీ హోల్డ్‌లో పెట్టి ఇష్టానుసారం దోచుకోవడం గమనార్హం. పోలవరం కాలువ ఒడ్డున ఉన్న క్రషర్లలో చాలా వాటికి అనుమతి లేకపోవడం గమనార్హం. మన జిల్లాకు చెందిన మాజీ మంత్రి ఒకరు ఇక్కడ క్రషర్‌ను కైవసం చేసుకున్నట్టు చెప్తున్నారు. వైసీపీ మరోసారి అధికారంలోకి వస్తే దేవీపట్నం మండలం, సీతానగరం, కోరుకొండ, గోకవరం సరిహద్దుల్లో ఉన్న కొండలన్నిటినీ మాయం చేయడానికి పెద్ద స్కెచ్ వేసినట్టు ఇపుడిపుడే బయటపడుతోంది.

ఉమ్మడి జిల్లాలో లేటరైట్ దోపిడీ రూ.కోట్ల మీదే ఉండడం గమనార్హం. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని ప్రత్తిపాడు మండలం చింతలూరు, వంతాడ గ్రామాల్లో లేటరైట్ గనులు ఉన్నాయి. గతంలో వీటిని ప్రస్తుత తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి గ్రామానికి చెందిన ఆంధ్రూస్ సంస్థ, ఓ ప్రముఖ సినీ నటి మేనల్లుడికి చెందిన మహేశ్వరి మినరల్స్, అనపర్తి మండలానికి చెందిన సత్తి లక్ష్మణరెడ్డి, గంగాధరరెడ్డిలకు చెందిన కంపెనీలు లీజుకు తీసుకుని లేటరైట్ వ్యాపారం చేసేవి. వైసీపీ అధికారంలోకి రాగానే ఆ పార్టీ పెద్దల కన్ను లేటరైట్ మీద పడింది. రాజమహేంద్రవరం విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో క్షుణ్ణంగా అక్కడ తవ్వకాలు, గనుల పరిస్థితిపై విచారణ చేయించి రిపోర్టును రాజమహేంద్రవరం విజిలెన్స్ ఆఫీసుకు తెలియనీయకుండా రాష్ట్ర కార్యాలయానికి రప్పించుకున్నారు. అప్పట్లో ఇక్కడ బాక్సైట్ ఉందనే ప్రచారం జరిగింది. విజిలెన్స్, మైన్స్ అధికారులు కూడా అప్పట్లో మౌనం వహించిన సంగతి తెలిసిందే. ఇక్కడ పరిస్థితిపై రిపోర్టు తీసుకెళ్లిన తర్వాత కొద్దిరోజులు పనులు ఆగాయి. ఇంతలో నర్సీపట్నం ఏరియాలో లేటరైట్ అక్రమాలు తవ్వకాలు జరుగుతున్నాయని టీడీపీ, ఇతర ప్రతిపక్షాలు ఆందోళన చేయడంతో అక్కడ తవ్వకాలు ఆగాయి. సిమెంట్ ఫ్యాక్టరీలకు లేటరైట్ అవసరం. ఈ పరిస్థితుల్లో వైసీపీ పెద్దలు చింతలూరు, వంతాడ నుంచి లైటరైట్ తరలించుకుపోవడానికి కుట్ర చేశారు. అప్పటికే సుమారు 4 లక్షల టన్నుల వరకూ లేటరైట్ స్టాక్ ఉంది. దీనిని తరలించుకుపోవడానికి ఒత్తిడి చేశారు. కానీ అక్కడి లీజుదారులు ఒప్పుకోలేదు. దీంతో 2010 నుంచి పెండింగులో ఉన్న ఓ సంక్షేమ సేవా సమితి అప్లికేషన్‌ను తెరమీదకు తెచ్చారు. దానిపేర బినామీ లీజు పొందారు. కానీ అక్కడ లేటరైట్ లేదని 2017లోనే ఇది ఎలిజిబుల్ కాదని, అప్పటి డీఎంజీ (ఎఫ్ఏసీ) బి.శ్రీధర్ ఫైల్‌ను రాజమహేంద్రవరం మైన్స్ అసిస్టెంట్ డైరెక్టర్‌కు పంపించారు.

ఇదిలా ఉండగా 2022 మార్చి 11న చింతలూరులోని సర్వే నెం.1లో సుమారు 36 హెక్టార్లలో లీజు ఖరారు చేస్తూ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ అండ్ జియాలజీ ఉన్నతాధికారి ఉత్తర్వు జారీ చేశారు. ఇక్కడ లేటరైట్‌ను బెనిఫికేషన్, సెపరేషన్, స్టోరింగ్, సెల్లింగ్ చేయడానికి లైసెన్స్‌ను ఓ మాజీ మంత్రి బంధువు పేరిట ఇచ్చారు. కానీ వారు లీజు దక్కించుకున్న సంక్షేమ సేవా సమితి లీజు స్థలంలో అసలు మైనింగ్ చేయకుండా గతంలో లీజుకు తీసుకున్న వారి భూముల్లో లేటరైట్ తవ్వేయడంతో పాటు... వారి స్టాక్ పాయింట్లలోని లేటరైట్ తరలించుకుపోవడం గమనార్హం. ఇక్కడ అటవీ ప్రాంతంలోని కొండలు తవ్వేసినట్టు కొందరు చెప్తున్నారు. ఇంత జరుగుతున్నా వైసీపీ పెద్దల అరాచకాలకు భయపడి లీజుదారులు మౌనంగా ఉండిపోయారు.

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొందరు లీజుదారులు ముందుకు వచ్చి ఇక్కడి అక్రమాలపై ఫిర్యాదు చేస్తున్నారు. అనపర్తి మండలం రామవరం గ్రామానికి చెందిన సత్తి లక్ష్మణరెడ్డి జూన్ 10వ తేదీన విజయవాడ ఇబ్రహీంపట్నంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మైన్స్ జియాలజీకి ఫిర్యాదు చేయడం గమనార్హం. ఇక్కడ సుమారు 10 లక్షల టన్నుల లేటరైట్ అక్రమ తవ్వకాలు జరిగినట్టు అందులో ఫిర్యాదు చేశాడు. మిగతావారు కూడా ఒక్కొక్కరుగా నెమ్మదిగా బయటకి వస్తున్నారు.

మైనింగ్ అక్రమాలపై కూటమి ప్రభుత్వం సీరియస్!

జిల్లా నుంచి లేటరైట్, గ్రావెల్, చింతూరు ప్రాంతం నుంచి క్వార్ట్జ్ కూడా అక్రమంగా తరలించుకు పోయినట్టు ఆరోపణలు ఉన్నాయి. గజ్జనపూడి ఫారెస్ట్‌లో అక్రమ మైనింగ్ చేసి పలు కేసుల్లో ఇరుక్కుని విజిలెన్స్ విధించిన జరిమానాలు కూడా కట్టకుండా తప్పించుకున్న వ్యక్తితో కూడా కుమ్మక్కయి అక్కడ రివిజన్ చేయించే ప్రయత్నాలు చేయడం గమనార్హం. ప్రభుత్వం మారడంతో అది ఆగిపోయింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ మైనింగ్ అక్రమాలపై సీరియస్‌గా ఉన్న సంగతి తెలిసిందే. ఈ అక్రమాలకు ప్రధాన కారకుడైన ఉన్నతాధికారిని సస్పెండ్ చేయడంతో పాటు ఆయనపై ఏసీబీ విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. మరోపక్క ఇసుక, గనుల అక్రమాలపై సీబీసీఐడీతో విచారణ చేయించనున్నారు. ఇప్పటికే ఇతర జిల్లాల్లో విచారణకు రాజమహేంద్రవరం విజిలెన్స్ అధికారులు కొందరు నియమితులు కావడం గమనార్హం. త్వరలో జిల్లాలో కూడా విచారణ చేపట్టనున్నారు. రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఇటీవల రాజమహేంద్రవరం వచ్చినపుడు కొందరు బాధితులు తమ గోడు విన్నవించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే బాధితులెవరైనా సరే ధైర్యంగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. గనులను దోచేసిన ఆ ఘనుల సంగతి త్వరలో తేలుతుందని జిల్లాకు చెందిన రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చెప్పడం గమనార్హం.




రాఘవ కనస్ట్రక్షన్స్ పేరిట ప్రతిమా ఇన్‌ఫ్రా దోపిడీ!

వైసీపీ ఆధ్వర్యంలో ఏ నిబంధనలూ పాటించకుండా రూ.కోట్లలో ఇసుక దోపిడీ చేశారు. మొదట జేపీ సంస్థకు కాంట్రాక్టు ఇచ్చి కనీసం ర్యాంపుల సరిహద్దులు కూడా గుర్తించని సంగతి తెలిసిందే. పైగా ఆన్‌లైన్ నిలిపివేసి కేవలం నగదు రూపేణా మాత్రమే వసూలు చేశారు. గత ఏడాది మేనెలలో ఆ సంస్థ కాంట్రాక్టు గడువు ముగిసినప్పటికీ దాని పేరిటే డ్రెడ్జింగ్ కూడా చేశారు. ఆ సంస్థను పక్కన పెట్టి వైసీపీ పెద్దలే కొవ్వూరు వైపు ఒకరికి, రాజమహేంద్రవరం వైపు ఒకరికి ఇచ్చేసి... నెలకు రూ.30కోట్ల వరకు కప్పం కట్టించుకున్నారు. తర్వాత కోర్టు జోక్యంతో ప్రతిమా ఇన్‌ఫ్రా సంస్థను తెరమీదకు తెచ్చి, దాని పేరిట ఆర్కే అనే వ్యక్తి మొత్తం దోపిడీ చేశారు. అంతేకాక అంతకు ముందే డ్రెడ్జింగ్‌కు ఒప్పందం కుదుర్చుకున్న రాఘవ కనస్ట్రక్షన్‌ను అప్పటి వరకు పనిచేయనివ్వకుండా చేసి గత ఏడాది డిసెంబరులో వాళ్లనూ తెరపైకి తెచ్చి మరింత దోచేశారు. చివరకు రాఘవ కనస్ట్రక్షన్ కంపెనీకి ఇవ్వాల్సిన డబ్బు కూడా ఎగ్గొట్టి ప్రతిమా ఇన్‌ఫ్రా సంస్థ పనులు వదిలేసి వెళ్లిపోవడంతో ఇవాళ అధికారులు లబోదిబోమంటున్నారు. కూటమి ప్రభుత్వం ఈ వ్యవహారాలపై విచారణ చేపట్టనుంది.



చెట్టు మొదులను పైకిలేపిన దృశ్యం

సినిమా చెట్టు... నిలబడేటట్టు!



కొవ్వూరు, ఆగస్టు 12: తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవంలో నేలకొరిగిన సినిమా చెట్టును పునరుజ్జీవింపచేసే పనులకు రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్ సభ్యులు సోమవారం శ్రీకారం చుట్టారు. నేలవాలిన చెట్టు కొమ్మలకు లేపనాలు పూశారు. చెట్టు కొమ్మలను పూర్తిగా కత్తిరించి రెండుగా విడిపోయిన మాను భాగాలను పైకిలేపి ఒక్కటిగా కలిపే యత్నం చేశారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్జేసీ సుబ్బారావు, అధికారులు

భీమేశ్వరస్వామి దేవస్థానంలో రికార్డుల తనిఖీ

ద్రాక్షారామ, ఆగస్టు 12: ద్రాక్షారామ భీమేశ్వరస్వామి దేవస్థానంలో అవినీతి, అవకతవకలు ఆరోపణల నేపథ్యంలో దేవదాయ శాఖ అధికారులు సోమవారం వసతి గృహంలో రికార్డుల తనిఖీ చేపట్టారు. ఈవో పీటీవీ సత్యనారాయణపై మంత్రి వాసంశెట్టి సుభాష్ దేవదాయ శాఖ కమిషనరుకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కమిషనరు ఆదేశాలతో ఇప్పటికే దేవదాయ శాఖ ఆర్జేసీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టరు కె.సుబ్బారావు ఈ నెల 9న ద్రాక్షారామలో ఫిర్యాదులు స్వీకరించారు. అంతేగాక గత ఐదేళ్ల పాటు దేవస్థానం రికార్డులను తనిఖీ చేయడానికి అధికారుల బృందాన్ని నియమించారు. ఆర్జేసీ సుబ్బారావు పర్యవేక్షణలో సహాయ కమిషనరు ఎస్ఎస్ చక్రధరరావు, కమిషనరు కార్యాలయ పర్యవేక్షకురాలు జ్యోతి, ఈవోలు సన్యాసిరావు, కె.శ్రీనివాసరావు, వెంకట్రావు, ఏఈ ఈశ్వర్, కమిషనరు కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వెంకట్రావు, ఆర్జేసీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఆచంట శ్రీనివాస్ రికార్డుల పరిశీలన ప్రారంభించారు. ఈవోపై వచ్చిన పలు ఫిర్యాదులతో పాటు రికార్డుల పరిశీలన ఆధారంగా కమిషనరుకు నివేదిక సమర్పిస్తారు. అంతేగాక గత ఐదేళ్లలో జరిగిన పూర్తి లావాదేవీలపై కూడా అధికారుల బృందం నివేదిక ఇవ్వనున్నట్టు తెలుస్తోంది.

కట్టు కాల్వలో కాళ్లు కడుక్కునేందుకు దిగిన
యువకుడు మృతి
ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం బీచ్ వద్ద ఘటన

ఉప్పలగుప్తం, ఆగస్టు 12: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం బీచ్ వద్ద ప్రమాదవశాత్తు కట్టు కాల్వలో పడి అమలాపురం మండలం వన్నెచింతలపూడికి చెందిన చికిలే సందీప్ (17) మృతి చెందాడు. సందీప్ సోమవారం మిత్రులతో కలిసి ఎస్.యానాం బీచ్‌కు వచ్చాడు. సముద్రంలో స్నానాల అనంతరం సమీపంలో ఉన్న కట్టుకాల్వలో కాళ్లు శుభ్రం చేసుకునేందుకు దిగి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. స్థానిక మత్స్యకారులు అతడిని రక్షించి ఒడ్డుకు తీసుకొచ్చారు. అయితే అప్పటికే అతడు మృతి చెందినట్టు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఇంటర్ చదివిన సందీప్ విశాఖలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులో చేరాడు. అతడి సోదరుడు గౌతమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ మనోహర్‌జోషీ తెలిపారు.



మృతుడు సందీప్ (పాత చిత్రం)

గంజాయి కేసులో నలుగురి అరెస్టు

చింతూరు, ఆగస్టు 12: గంజాయి కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు సీఐ గజేంద్రకుమార్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడకు చెందిన బప్పిరాయ్, కిరండోల్‌కు చెందిన షివేందురాయ్, సుక్మాకు చెందిన ధర్మేంద్ర సింగ్ మనిష్‌సింగ్ గంజాయితో పట్టుబడ్డారు. వీరంతా ఛత్తీస్‌గఢ్‌లోని కుంట నుంచి చింతూరు మండలం చట్టి మీదుగా భద్రాచలం వైపు ఆదివారం రాత్రి పదకొండు గంటల సమయంలో కారులో వెళ్తున్నారు. తనిఖీల్లో భాగంగా కారును ఆపి డిక్కీ తెరిచి చూడగా అందులో 15 కిలోల గంజాయి కనిపించింది. కారుతో పాటు అందులో వున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. ఇదే కేసులో వీరితో పాటు కుంటకు చెందిన ఇషాద్, పవన్‌లపై కూడా తమకు అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామని, వారిద్దరూ పరారీలో వున్నారని సీఐ చెప్పారు.

గేమ్ చేంజర్: ఎల్లో ఉగ్రవాది
ఈ పేరుతో సోషల్ మీడియాలో రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారం
భారత న్యాయ సంహిత చట్టం కింద ఎటపాక పోలీస్ స్టేషన్లో కేసు నమోదు

రంపచోడవరం, ఆగస్టు 12: చంద్రబాబు సారథ్యంలో ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపై సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం సాగించి ప్రభుత్వ విచ్ఛిన్నానికి పాల్పడుతున్న వారిపై మన్యంలో కేసు నమోదైంది. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక పోలీసు స్టేషన్లో క్రైం నెం.104/2024 కింద నమోదైన కేసు వివరాలు ఇలా వున్నాయి.... రాష్ట్రంలో యూట్యూబ్ అకాడమీ స్థాపించడానికి యూట్యూబ్ గ్లోబల్ సీఈవోతో జరిగిన చర్చలపై గూగుల్ హెడ్‌ని ట్యాగ్ చేసి 'ఎక్స్'లో ముఖ్యమంత్రి పోస్టు పెట్టారు. దానికి గేమ్ చేంజర్: ఎల్లో ఉగ్రవాది అనే అతను రిప్లై ఇస్తూ రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ సక్రమంగా లేదని గూగుల్‌ని ట్యాగ్ చేస్తూ.... మీ కంపెనీలో మహిళా ఉద్యోగులు వేధింపులకు గురైనా పోలీసులు చూస్తూ ఉంటారనడంతో పాటు పలు అంశాలను ప్రస్తావిస్తూ రిప్లై ఇచ్చాడు. ఇలా సోషల్ మీడియాలో నేరపూరిత కుట్రకు పాల్పడటం, వర్గ విభేదాలను సృష్టించడం, తప్పుడు ప్రకటనలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఎటపాకకు చెందిన పాటి సంపత్, మరో ఇద్దరు ఎటపాక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో భారత న్యాయ సంహిత చట్టంలో 61(2), 196(1), 353(2) సెక్షన్ల కింద ఎటపాక పోలీసులు కేసు నమోదు చేశారు. ఐటీ నిపుణుల సహాయంతో సోషల్ మీడియా సంస్థల నుంచి సమాచారాన్ని సేకరిస్తూ నిందితులను గుర్తించే దిశలో కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సామర్లకోట, ఆగస్టు 12: సామర్లకోట-పిఠాపురం రైల్వే లైన్ మధ్య నడుస్తున్న 48 ఏళ్ల వ్యక్తిని అతి వేగంగా వెళ్తున్న భువనేశ్వర్-రామేశ్వరం సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఢీకొంది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందినట్టు సామర్లకోట రైల్వే పోలీసు స్టేషన్ ఇన్‌చార్జి ఎస్‌ఐ ఎన్.రవికుమార్ సోమవారం రాత్రి చెప్పారు. ఈ మేరకు రైలు లోకో పైలట్ సామర్లకోట రైల్వే అధికారులకు ఇచ్చిన సమాచారంతో రైల్వే పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టినట్టు చెప్పారు. నలుపు, తెలుపు, డార్క్ చెక్స్ షర్ట్ ధరించి, ఆరెంజ్, ఎల్లో రంగుతో కూడిన షార్ట్ నిక్కరు మాత్రమే ధరించి ఉన్నాడు. అంతకు మించి ఎటువంటి చిరునామా లభించలేదని ఎస్‌ఐ చెప్పారు.

ఏజెన్సీ సమాచారం



అర్జీదారులతో మాట్లాడుతున్న పీవో సింహాచలం

అర్జీలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఐటీడీఏ పీవో సింహాచలం

రంపచోడవరం, ఆగస్టు 12: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని ఐటీడీఏ పీవో కట్ట సింహాచలం కోరారు. సోమవారం ఐటీడీఏ కార్యాయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన ఏపీవో(జీ) సీహెచ్ శ్రీనివాసరావుతో కలిసి సుమారు 47 అర్జీలు స్వీకరించారు. కతనపల్లి, పెద్దగూడెం, సోమర్లపాడు, కొక్కిరిగూడెం గ్రామాల ముంపు బాధితులు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని, నేలదో నెలపాడు ఆర్అండ్ఆర్ కాలనీల్లో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, మారేడుమిల్లి పోలీస్‌స్టేషన్ నుంచి ఏపీఆర్ గురుకుల పాఠశాల వరకు రోడ్డు వెడల్పు చేయాలని, కొండమొదలు పీహెచ్‌సీలో వైద్యాధికారిని నియమించాలని, పాఠశాలల్లో భవనాలు ఏర్పాటు చేయాలని కోరుతూ అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కె.దేవేంద్రుడు, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్‌స్పెక్టరు బాబూరావు, తహసీల్దారు కృష్ణజ్యోతి, ఏడీఎంహెచ్‌వో శిరీష, ఏపీడీ ఎ.శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పనులు సకాలంలో పూర్తి చేయాలి

రంపచోడవరం, ఆగస్టు 12: ఏజెన్సీలో వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో సింహాచలం అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో ఆయన వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. మలేరియా ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలన్నారు. రైతులకు మొక్కల పంపిణీపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏరియా ఆసుపత్రిలో డయాలసిస్ పేషెంట్లకు తాగునీరు అందిస్తున్న తీరును పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఏపీవో (జీ) సీహెచ్ శ్రీనివాసరావు, ఇనస్పెక్టర్ ఆఫ్ సర్వే కె.దేవేంద్రుడు, ఏడీఎంహెచ్‌వో శిరీష, ఈఈలు జి.డేవిడ్‌రాజ్, ఎండీ యూసఫ్, రవికుమార్, ఏడీఏలు సీహెచ్‌కేవీ చౌదరి, సావిత్రి, ఏపీడీలు జి.శ్రీనివాసరావు, ఎ.శ్రీనివాసరావు, పీహెచ్‌వో చిట్టిబాబు, సీడీపీవో సంధ్యారాణి, తహసీల్దారు కృష్ణజ్యోతి, వైద్యాధికారిణి ఇందిర, డీఈలు సాయిసతీష్, రాజేంద్రబాబు, శ్రీహరి పాల్గొన్నారు.

ఫోటో 12ఆర్‌జెవి1 సమస్యలపై ప్రశ్నిస్తున్న ఎంపిటిసి పెద్దిరాజు

సాకులు చెప్తూ సాగదీస్తారా

రాజవొమ్మంగి మండల సమావేశంలో
అధికారుల తీరుపై ప్రజాప్రతిధుల మండిపాటు



సమస్యలపై మాట్లాడుతున్న ఎంపీటీసీ పెద్దిరాజు

రాజవొమ్మంగి, ఆగస్టు 12: రాజవొమ్మంగి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో తమ ప్రశ్నలకు అధికారులు సాకులు చెప్తూ సాగదీశారని ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మీ అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో ప్రారంభంలోనే లబ్బర్తి ఎంపీటీసీ గొల్లపూడి పెద్దిరాజు, దూసరపాము ఎంపీటీసీ నల్లా సత్తిబాబు మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు రాకుండా సమావేశం ఎందుకన్నారు. టీ, సమోసాలు తిని వెళ్లేందుకు వచ్చినట్టు ఉందన్నారు. గత సర్వసభ్య సమావేశాల్లో తాము చెప్పిన సమస్యలు నేటికీ పరిష్కారం కాలేదన్నారు. మరలా సమస్యలు చెప్పి ఉపయోగం ఏమిటని ప్రశ్నించారు. సమావేశం ప్రారంభంలోనే విద్యుత్ శాఖ ఏఈ చిన్నబాబుపై ప్రజాప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో వీధిలైట్లకు మరమ్మతులు చేయించలేని పరిస్థితిలో ప్రజాప్రతినిధులం ఉన్నామని అసహనం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో మండలంలో లబ్బర్తి, దూసరపాము, జడ్డంగి సచివాలయలకు ఆధార్ కేంద్రాలు మంజూరైనప్పటికీ అవి వినియోగంలోకి రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రజాప్రతినిధులు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలు, సచివాలయ భవనాలు నిర్మాణ దశలోనే ఉండిపోయాయని లబ్బర్తి ఎంపీటీసీ గొల్లపూడి పెద్దిరాజు అధికారులకు గుర్తు చేశారు. తల్లిపాల వారోత్సవాలకు మండలంలో ఎక్కడా ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వలేదని పలువురు తెలిపారు. దీనిపై ఐసీడీఎస్ సీడీపీవో దేవమణి మాట్లడుతూ ఐసీడీఎస్ కార్యాలయం శిధిలావస్థకు చేరడంతో ప్రజాప్రతినిధులను పిలవలేకపోయానని చెప్పుకొచ్చారు. ఆమె సమాధానంతో వారంతా ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సర్పంచ్ గొల్లపూడి రమణి, జడ్పీటీసీ వడుగుల జ్యోతి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

మోతుగూడెం, ఆగస్టు 12: ప్రజలు సీజనల్ వ్యాదుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మోతుగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి ప్రజ్ఞ సూచించారు. సోమవారం ఆమె మోతుగూడెం పీహెచ్‌సీలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఇరవై రోజులుగా కురుస్తున్న వర్షాలకు గెడ్డలు బురద నీటితో నిండిపోయాయని, రక్షిత మంచిటి పథకాలు లేనిచోట కాచిన నీటిని తాగేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. చిన్నపాటి జ్వరం వచ్చినా వెంటనే వైద్యం చేయించుకోవాలన్నారు. మలేరియా, టైఫాయిడ్, అతిసార వ్యాధులు ప్రబలే అవకాశమున్న దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలన్నారు.



తహశీల్దార్ చలపతిరావును సన్మానిస్తున్న దృశ్యం

తహశీల్దార్‌కు వీడ్కోలు సన్మానం

దేవీపట్నం, ఆగస్టు 12: తహసీల్దార్ పీవీ చలపతిరావు వీడ్కోలు సన్మాన సభను కొండదొరల సంఘం జిల్లా నాయకుడు యలగాడ నాగేశ్వరరావు, ఆదివాసీ జేఏసీ రాష్ట్ర నాయకులు తెల్లం శేఖర్, కారం రామన్నదొర నిర్వహించారు. తహసీల్దార్‌కు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. దూసరి హరిబాబు, టెంకి రాంబాబు, కోర్లాపు శ్రీధర్ పాల్గొన్నారు.

పీవోను కలిసిన జేఏసీ నాయకుడు



దేవీపట్నం, ఆగస్టు 12: ముసురుమిల్లి ప్రాజెక్టు కాలువకు పడిన గండిని పూడ్చి దేవారం, శరభవరం పంచాయతీల రైతులకు సాగు నీరందించేలా చర్య లు తీసుకోవాలని ఆదివాసీ జేఏసీ నాయకుడు తెల్లం శేఖర్ కోరారు. సోమవారం ఆయన ఐటీడీఏ పీవో సింహాచాలనికి ఈ మేరకు వినతిపత్రం అందిం చారు. ఆశ్రమ పాఠశాలలో ఏఎన్ఎం పోస్టు భర్తీ చేయాలని కోరారు. సుండం బాబూరావు, పి.పాపారావు, ఎస్.సుధాకర్ కోరారు.

'రెండుసార్లు సస్పెండైన వ్యక్తికి ఇన్‌చార్జి బాధ్యతలా!'

కూనవరం, ఆగస్టు 12:

విద్యా శాఖలో అనేక ఆరోపణలు ఎదుర్కొంటూ రెండుసార్లు సస్పెండ్ అయిన ఎంఈవో లక్ష్మీనారాయణకు నాలుగు మండలాల బాధ్యతలు అప్పగించడం అధికారులకు ఎంతవరకు సబబు అని కూనవరం యూటీఎఫ్ నాయకుడు పాయం కన్నారావు అన్నారు. గతంలో ఉపాధ్యాయుల వ్యక్తిగత భీమా పాలసీలు, పాఠశాల గ్రాంట్లు కాంప్లెక్స్ గ్రాంట్లు స్వాహా చేశారని... వెంటనే ఆ సొమ్మును లక్ష్మీనారాయణ దగ్గర నుంచి రికవరీ చేయాలన్నారు. ఆయన్ను తొలగించి కొత్తవారిని నియమించాలని అల్లూరి జిల్లా డీఈవోను కోరారు.

ఎస్‌కేవీటీలో నేడు, రేపు 'నాక్' పరిశీలన

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 12: రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఈనెల 13, 14 తేదీల్లో నాక్ పీర్ బృందం పరిశీలించనుందని ప్రిన్సిపాల్ ఏబెల్ రాజబాబు అన్నారు. ఈ మేరకు సోమవారం కళాశాలలో సంబంధిత అన్ని విభాగాధిపతులు, ఫ్యాకల్టీతో ఆయన సమావేశమయ్యారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఫకర్ మోహన్ యూనివర్శిటీ వీసీ మదుమిత దాస్ ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించే నాక్ బృందం కళాశాలను సందర్శించి పలు విషయాలను పరిశీలిస్తుందన్నారు. అన్ని విభాగాల ఫ్యాకల్టీ, విద్యార్థులు విద్యాసంస్థ పరంగా చేసిన ప్రగతిని నాక్ బృందం పరిశీలనలోకి తీసుకుని ర్యాంకు ఇవ్వడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలి

- ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి
- పలుచోట్ల హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు

అనపర్తి, ఆగస్టు 12: భారతదేశ ఔన్నత్యాన్ని ప్రతి పౌరుడు ప్రపంచానికి చాటి చెప్పాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. హర్ ఘర్ తిరంగ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం అనపర్తిలో భారీ ర్యాలీ నిర్వహించారు. ముందుగా కెనాల్ రోడ్డులోని అంబేద్కర్, పూలే విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి పౌరులతో ప్రమాణం చేయించి ర్యాలీ ప్రారంభించారు. మెయిన్‌రోడ్డులోని గాంధీ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసంగిస్తూ ప్రతి ఇంటిపైనా జాతీయ జెండాను ఎగురవేయాలని సూచించారు. ముందుగా రామవరంలోని ఎమ్మెల్యే నివాసం వద్ద ఇంటిపై ఆయన జెండాను ఎగురవేసి హర్ ఘర్ తిరంగ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తమలంపూడి సుధాకరరెడ్డి, సత్తి దేవదాసరెడ్డి, సిరసపల్లి నాగేశ్వరరావు, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, ఏరియా ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి, ఎమ్ఈవో నల్లమిల్లి సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: బిక్కవోలు వంతెన వద్ద నుంచి మదుగులమ్మ గుడి సెంటర్ వరకూ విద్యార్థులు, ఉపాధ్యాయులు, వివిధ శాఖల ఉద్యోగులతో జాతీయ జెండాలు చేతబూని ర్యాలీ జరిపి, గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు.



అనపర్తిలో మహాత్ముడికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి భారతీయుడిలో జాతీయ భావం పెంపొందాలనే ఉద్దేశ్యంతో ప్రధాని హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. కార్యక్రమంలో కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, పల్లి వాసు, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, గొరెల త్రిమూర్తులు, పవన్‌కుమార్‌రెడ్డి, తనుకు శ్రీధర్, ఇందల వీరబాబు, గుణ్ణం శ్రీనివాసచౌదరి,సింగారపు రామారావు పాల్గొన్నారు.

రంగంపేట: చంద్రేడు గ్రామంలో హైస్కూల్ హెచ్ఎం జి.రమణబాబు ఆధ్వర్యంలో విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీలో టీడీపీ నియోజకవర్గ రైతు అధ్యక్షుడు మద్దిపాటి సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగిరే విధంగా విద్యార్థులు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీల నిర్వహణపై శిక్షణ తరగతులు

రాజమహేంద్రవరం రూరల్ /కడియం/రాజానగరం, ఆగస్టు 12: రాజమహేంద్రవరం రూరల్, కడియం, రాజానగరం మండలాల్లో సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణా తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. అయా మండల పరిషత్ కార్యాలయాల్లో జరిగిన కార్యక్రమాల్లో తొలిరోజు గ్రామ పంచాయతీ విధులు-బాధ్యతలు, పారిశుధ్యం ఘన వ్యర్థాల నిర్వహణ, చెత్త సేకరణ, గ్రామ పంచాయతీల పాత్ర, ఇతర గ్రామ పంచాయతీల పరిపాలన అంశాలు, పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక తయారు చేసే విధానం, డ్రగ్స్ రహిత సమాజంపై అవగాహన కల్పించారు. కాగా రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని 10 గ్రామాలకు సర్పంచ్‌లు లేకపోవడంతో ప్రత్యేకాధికారుల పాలనలో వుంది. ఈ శిక్షణా కార్యక్రమాలకు ప్రత్యేకాధికారులు కూడా హాజరు కాలేదు. ట్రెయినీ ఎక్సపర్ట్‌లుగా పంచాయతీ కార్యదర్శులే వ్యవహరించి తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులు కూడా అరకొరగానే హాజరయ్యారు. కడియంలో కార్యక్రమాన్ని మండల గౌరవాధ్యక్షుడు వెలుగుబంటి సత్యప్రసాద్ ప్రారంభించారు. ఎంపీడీవో జి.రాజ్‌కుమార్, ఫ్యాకల్టీ సభ్యులు బి.సరోజరాణి, బి.తాతారావు, ఈవోపీఆర్డీ విక్టర్ బాబు, పరిపాలనాధికారి వీవీ సుబ్బారావు పాల్గొన్నారు. రాజానగరంలో కోర్సు డైరెక్టరుగా ఎంపీడీవో జ్యోతిర్మయి, అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఎం.సుబ్రహ్మణ్యం, మాస్టర్ ట్రైనర్లుగా శ్రీరామ్మూర్తి, జీవీవీఎస్‌కే ప్రసాద్, అసిస్టెంట్‌గా మహేష్ సాయి పృథ్వీనాథ్ అసిస్టెంట్‌గా వ్యవహరించారు.



రంగంపేటలో ఎంఈవోలకు వినతిపత్రం అందిస్తున్న ఫ్యాప్టో నాయకులు

ఉపాధ్యాయ సంఘాల సూచనలు

పరిగణనలోకి తీసుకోవాలి

- ఫ్యాప్టో నేతల డిమాండ్.. ఎంఈవోలకు వినతులు

బిక్కవోలు, ఆగస్టు 12: టీచర్ల పని సర్దుబాటులో ఉపాధ్యాయ సంఘాల సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని ఫ్యాప్టో నేతలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం మండలంలోని ఫ్యాప్టో నేతలు ఎంఈవోలు సత్యనారాయణ, పూర్ణచంద్రరావును కలసి వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయుల పని సర్దుబాటులో 2020లో విడుదల చేసిన జీవో 53 ప్రకారం చేపట్టాలని, సీనియర్‌కు విల్లింగ్ అవకాశం కల్పించాలని, ఈప్రక్రియ మండల, డివిజన్‌కే పరిమితం చేయాలని, పీఎస్‌హెచ్ఎం పోస్టులను విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా కొనసాగించాలని, యూపీ స్కూళ్లలో జీవో 60 మేరకు స్కూల్ అసిస్టెంట్లను కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు గోవిందర్గావు, అంజనీకుమార్, రామచంద్రారెడ్డి, సతీష్‌కుమార్, సంధ్యారాణి, విజయదుర్గ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండ: స్థానిక మండల విద్యా వనరుల కేంద్రం వద్ద యూటీఎఫ్, పీఆర్టీయూ, ఎస్టీయూ నాయకులు నిరసన తెలిపి ఎంఈవోకు వినతిపత్రం అందజేశారు. డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిర్వహించిన కౌన్సెలింగ్‌ను బహిష్కరించారు. మండల విద్యాశాఖ సోమవారం మధ్యాహ్నం నిర్వహించ తలపెట్టిన ఉపాధ్యాయ పని సర్దుబాటు కౌన్సెలింగ్‌ను వాయిదావేశారు. తిరిగి ఈ నెల 17న రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల ప్రకారం ఉపాధ్యాయుల పని సర్దుబాటు జరుగుతుందని ఎంఈవో టి.కుశలవ దొర తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు శివబాబు, రాజేష్, పీఆర్టీ జిల్లా అధ్యక్షుడు పి.రాజారావు, మండలాధ్యక్షుడు మింగి శ్రీనివాస్, కల్లేపల్లి నాగేశ్వరరావు, మండలంలోని 50మంది సర్‌ప్లస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రంగంపేట: ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను బహిష్కరిస్తున్నామని పేర్కొంటూ స్థానిక ఎంఈవో కార్యాలయం వద్ద ఎంఈవోలు కె.శ్రీనివాసరావు, పి.మధుసూదనరావులకు ఉపాధ్యాయ సంఘ నాయకులు వినతిప్రతం అందించారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు కె.రాంబాబు, కె.ధర్మరాజు, ఐ.విజయ్‌బాబు, కె.రాజు, వి.సత్యనారాయణ, ఎం.అనిల్, కె.శంకర్, వై.మణికంఠ తదితర నాయకులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల రహితంగా జిల్లాను మారుస్తాం

- నషా ముక్త్ భారత్ అభియాన్ ర్యాలీలో ఎస్పీ నరసింహ కిషోర్

రాజమహేంద్రవరం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల రహితంగా జిల్లాను తీర్చిదిద్దే దిశగా చర్యలు చేపట్టామని ఎస్పీ నరసింహ కిషోర్ పేర్కొన్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా శిరిడి సాయి జూనియర్ కళాశాల విద్యార్థులతో ప్రకాశంనగర్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. గంజాయి వంటి మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై చైతన్యం కలిగించడానికి రోజూ విద్యాలయాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.అనంతరం మాదకద్రవ్యాల జోలికి వెళ్లబోమంటూ విద్యార్థులతో ఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్ర మంలో సీఐ కేవీఎస్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పాయింట్లు తనిఖీ

నగరంలోని రద్దీగా ఉంటే పలు ట్రాఫిక్ పాయింట్లను ఎస్పీ నరసింహ కిషోర్ సోమవారం తనిఖీ చేశారు. ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు, సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేశ్, ట్రా ఫిక్ సీఐలు ఎస్సీలు ఆయా పాయింట్ల పరిస్థితుల గురించి వివరించారు. చట్టాలను ఉల్లంఘిస్తూ ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయడం, ఇష్టానుసారం డ్రైవింగ్ వంటివి చేస్తే కఠిన చర్యలు



నగరంలో ట్రాఫిక్ పాయింట్లను పరిశీలిస్తున్న ఎస్పీ కిషోర్

తీసుకుంటామని ఎస్పీ కిషోర్ హెచ్చరించారు. ట్రాఫిక్‌కి ఇబ్బంది లేకుండా వాహనాలను పార్కింగ్ చేయాలన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కి 18 ఫిర్యాదులు

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్‌లో 18 మంది తమ ఫిర్యాదులను అడిషనల్ ఎస్పీ(పరిపాలన)ఎస్ఆర్ రాజశేఖర్ రాజుకు అందజేశారు.ఆయన స్వయంగా ఫిర్యాదుదారులతో మాట్లాడి చట్ట ప్రకారం త్వరితగతిన సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఫిర్యాదులను తదుపరి చర్యల నిమిత్తం ఆయా అధికారులకు పంపించారు.

జీతాల కోసం జీజీహెచ్ సెక్యూరిటీ కార్మికుల ధర్నా

సూపరింటెండెంట్ హామీతో సమ్మె విరమణ

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 12: పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాజమహేంద్రవరం జీజీహెచ్ (ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి) సెక్యూరిటీ కార్మికులు సోమవారం నిరవధిక నిరసన ధర్నా చేశారు. సమ్మెకు సిద్ధమైన కార్మికులు ప్రధాన కార్యాలయం ఎదుట పెండింగ్ జీతాలు మంజూరు చేయాలని, పీఎఫ్ అకౌంట్లు అందరికీ ఇవ్వాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని నినాదాలు చేశారు. దీంతో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ సెక్యూరిటీ కార్మికుల వద్దకు వచ్చి వారితో మాట్లాడారు. వీలైనంత త్వరగా జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆందోళనకు మద్దతుగా ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కూండ్రపు రాంబాబు, యూనియన్ నాయకులు జీజీహెచ్ ఆర్ఎంవో ప్రణవ్‌ను కలిశారు. ఏఐటీయూసీ నాయకులు కొండలరావు, చింతలపూడి సునీల్, సెక్యూరిటీ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు ములగాడ ప్రసాదరావు, కుమార్, శివ, పెద్దబ్బాయి, మోహన్, నరేష్, సూరిబాబు, భాగ్యలక్ష్మి, సుశీల, అనంతలక్ష్మి, విజయలక్ష్మి, మీనాక్షి, గంగారత్నం, వరలక్ష్మి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నషా ముక్త్ భారత్ అభియాన్‌పై అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 12: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, యూత్ రెడ్‌క్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో పుష్కరమాతా కాన్వెంట్ కమిటీ నేతృత్వంలో సోమవారం నషాముక్త్ భారత్ అభియాన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ విద్యార్థులకు ఆరోగ్యం, కుటుంబ బాంధవ్యాలపై ఉండే బాధ్యతలను తెలియజేశారు. యువత డ్రగ్స్‌కు అలవాటు పడితే ఎటువంటి పరిణామాలు సంభవిస్తాయో వివరించారు. అడిక్షన్ సెంటర్ సైకాలజిస్ట్, కౌన్సిలర్ సుందర్‌రాజు, డాక్టర్ శోభారాణి పాల్గొన్నారు.

హోటల్‌లో సోదాలు.. కేసు నమోదు

రాజమహేంద్రవరం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఆహార భద్రత, తూనికలు కొలతల శాఖ అధికారులతో కలిసి విజిలెన్స్ అధికారులు ఏవీ అప్పారావు రోడ్‌లోని శ్రీ సూర్య రెస్టారెంట్‌లో తనిఖీలు చేశారు. క్యాండీడ్ పపయా టూటీ ఫ్రూటీ కిలో ప్యాక్, అరకిలో లూజు ప్యాక్‌లపై కాలపరిమితి ముగియడం, వంటకు వినియోగించే నూనె కూడా నిబంధనలకు విరుద్ధంగా ఉండడం గుర్తించారు. నమూనాలను సేకరించి కేసు నమోదుచేశారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్ఐ టి.జగన్నాథరెడ్డి, ఏవో జె.భార్గవమహేశ్, తహశీల్దారు కె.విజయ్‌కుమార్, పీసీలు వీరబాబు, లోవరాజు, కిషోర్‌కుమార్, శివకుమార్, లీగల్ మెట్రాలజీ అసిస్టెంటు కంట్రోలర్ సాల్మన్‌రాజు,ఫుడ్‌సేఫ్టీ అధికారి రుక్కయ్య పాల్గొన్నారు.

హోంమంత్రిని కలిసిన కమిషనర్ కేతన్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 12: రాజమహేంద్రవరం పర్యటనకు వచ్చిన రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితను నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం నగరంలో హోంమంత్రి వంగలపూడి అనితకు పుష్పగుచ్ఛం అందించారు. అదేవిధంగా జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

మహిళల రక్షణ కూటమి ప్రభుత్వ ధ్యేయం

మీ భద్రత మా బాధ్యతలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 12: మహిళల రక్షణ కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం డీఎంహెచ్ స్కూల్ ఆవరణలో సోమవారం రాత్రి జరిగిన మీ భద్రత మా బాధ్యత సభలో ఆయన మాట్లాడారు. ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్టవేస్తామని, గంజాయి, బ్లేడు బ్యాచ్‌ల నిర్మూలనకు తమ ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని చెప్పారు. జనసేన నగర ఇంచార్జీ అనుశ్రీ సత్యనారాయణ మాట్లాడుతూ అక్రమార్కులపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 12: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి సునీల్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో వేడుక నిర్వహించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కూండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి కొండలరావు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో 20 శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 10 శాతం నిధులను విద్య కోసం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంధ్య పూజ, వర్ధిని, చంటి, వినీత, హారిక, వెంకటకృష్ణ, గోపాల్ పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో అథ్లెటిక్స్ సెలక్షన్స్

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 12 : రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని 400 మీటర్ల అథ్లెటిక్ ట్రాక్‌లో సోమవారం క్రీడాకారుల సెలక్షన్స్ నిర్వహించారు. సెప్టెంబరులో గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగే జిల్లా స్థాయి పోటీలకు సంబంధించి ఈ ఎంపికలు జరిగాయి. జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినీ విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే అభినందించారు. కళాశాల క్రీడల విభాగాధిపతి ఎం.ప్రసాదరావు, పీడీలు విజయ్, లక్ష్మి పాల్గొన్నారు.

ఎప్పటికి పూర్తయ్యేనో!

- గాడాల సొసైటీ భవనానికి శంకుస్థాపన జరిగి నాలుగేళ్లు
- ప్రారంభం కాని నిర్మాణ పనులు



2020లో వేసిన శంకుస్థాపన శిలాఫలకం

కోరుకొండ, ఆగస్టు 12: గాడాల వ్యవసాయ సొసైటీకి గోడౌన్, నూతన కార్యాలయ భవన నిర్మాణం కోసం 2020 జూలైలో అప్పటి ప్రభుత్వం శంకుస్థాపన చేసి శిలాఫలకం వేశారు. ఇది జరిగి నాలుగేళ్లు పూర్తయినా ఇప్పటి వరకూ నూతన భవన నిర్మాణం ప్రారంభమే కాలేదు. శిథిలమైన భవనాన్ని కూల్చలేదు. శిథిలమై కూలడానికి సిద్ధంగా ఉన్న భవనంలో విధులు నిర్వహించలేక, రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుమందులు నిల్వ చేసుకునే సౌకర్యం లేక సిబ్బంది విధులు నిర్వహించేందుకు కొన్నేళ్ల క్రితమే అద్దె భవనంలోకి మకాం మార్చారు. గాడాల, మధురపూడి, నిడిగట్ల గ్రామాల రైతులకు ఎన్నో సేవలు అందించిన ఈ సొసైటీకి నూతన గోడౌన్ కార్యాలయ భవనం కనీసం కూటమి ప్రభుత్వమైనా నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

డ్రగ్స్‌తో జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 12: యువత మాదక ద్రవ్యాల వినియోగం వైపు ప్రభావితం కావొద్దని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల నియంత్రణపై మండలంలోని కాతేరు వ్యవసాయ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యార్థులు తెలిసిగాని, తెలియకగాని మాదక ద్రవ్యాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని, దాని వల్ల కలిగే దుష్పరిణామాలను ప్రతిఒక్కరికీ తెలిసేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. నేడు సమాజంలో సుమారు 70శాతం మంది ఆల్కాహాల్ తీసుకుంటున్నారని, ముఖ్యంగా యువత కొత్తదనం పట్ల ఆకర్శితులవుతున్నారని, ఒకసారి చేసి చూద్దామనే భావనలో వుండి ఆ దిశగా ప్రభావితులవుతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాలకు బానిసలుగా మారకుండా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్డీవో కేఎల్ జ్యోతి, ఐసీడీఎస్ పీడీ విజయలక్ష్మి, విజిలెన్స్ అదనపు ఎస్పీ సోమశేఖర్, కళాశాల అసోసియేట్ డీన్ శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణకు ఆదేశం

కడియం/రూరల్, ఆగస్టు 12: దుళ్ల గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై సోమవారం కలెక్టర్ పి.ప్రశాంతికి నాయకులు ముమ్మిడి నాగేశ్వరరావు, తూము శ్రీను, సీహెచ్ఎస్ రావు, ఏజీవీ ప్రసాద్ ఫిర్యాదు చేశారు. సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, కార్యదర్శి కలిసి అధికార దుర్వినియోగం చేసి సొమ్ము స్వాహా చేశారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. 2022 ఏప్రిల్ 18న స్పందనలో మాజీ సర్పంచ్ అమ్మిరాజు, గ్రామస్థులు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు దానిపై విచారణ జరపలేదని చెప్పారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే విచారణకు ఆదేశించారు. పంచాయతీ నిధుల దుర్వినియోగం ఎవ్వరు చేసినా వారిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దీనిపై తనకు నివేదిక అధికారులకు ఆదేశించారు.

దళితుడిపై దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి

గోకవరం రెవెన్యూ కార్యాలయం ఎదుట దళితుల ఆందోళన

గోకవరం, ఆగస్టు 12: మండలంలోని వీరలింకపల్లిలో దళిత వ్యక్తిపై దాడి చేసిన నిందితుడిని అరెస్ట్ చేయాలంటూ సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట బాధితుడితో పాటు మరికొందరు ఆందోళన నిర్వహించారు. ఈ ఆందోళనకు ప్రముఖ న్యాయవాది పిల్లి బలరాముడు నాయకత్వం వహించి మాట్లాడారు. 12 రోజుల కిత్రం భూమి ఆక్రమణ విషయంలో వీరలింకపల్లిలో దళితుడైన పైడిమల్ల చినరాజుకు, అల్లాడి నాగేశ్వరరావుకు మధ్య ఘర్షణ జరిగిందన్నారు. చినరాజుపై నాగేశ్వరరావు దాడి చేసి గాయపరిచాడని, దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు నాగేశ్వరరావును అరెస్ట్ చేయలేదన్నారు. పోలీసులు నిందితుడిని కాపాడుతున్నారని ఆరోపించారు. మరో రెండు రోజుల్లో అరెస్ట్ చేయకపోతే సంబంధిత పోలీస్ అధికారులపై ప్రైవేట్ కేసులు నమోదు చేయిస్తామన్నారు. ఈ ఘటన జరగడానికి పరోక్షంగా రెవెన్యూ అధికారుల పాత్ర కూడా ఉందన్నారు. తన భూమి ఆక్రమణ విషయంలో న్యాయం చేయాలంటూ రెవెన్యూ కార్యాలయం చుట్టూ సుమారు నాలుగేళ్ల నుంచి తిరుగుతున్న చినరాజుకు అధికారులు న్యాయం చేసుంటే ఈ దాడి జరిగేది కాదన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రెవెన్యూ అధికారులకు అందజేశారు.

ముగిసిన బంగారు వరలక్ష్మి కానుక లక్కీడ్రా

గోకవరం, ఆగస్టు 12: మహిళల్లో హైందవ చైతన్యం తీసుకురావడమే ధ్యేయమని విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక సూర్య కళ్యాణ మండపంలో గోకవరం మండల పరిసర ప్రాంతాల్లోని సుమారు 29 గ్రామాల మహిళలకు బంగారు వరలక్ష్మి కానుక-2 లక్కీడ్రా ముగింపు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన లక్కీ డ్రాలో 133 మంది మహిళలు విజేతలుగా నిలిచారు. వీరందరికీ ఒక్కొక్కరికీ రూ.7,500 విలువైన ఒక గ్రాము బంగారు వరలక్ష్మి రూపును ఉచితంగా అందజేశారు. ఈ ఏడాది మొత్తం కార్యక్రమంలో 17,000 మంది రిజిస్ట్రేషన్ చేయించుకోగా 440 మంది మహిళలు విజేతలుగా నిలిచారని శ్రీనివాసరావు వివరించారు. కార్యక్రమంలో రామసేన సభ్యులు మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, ఇనగోటి బాపన్నదొర, వరసాల ప్రసాద్, వల్లూరి జగన్నాథశర్మ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రీసర్వే డీటీ సాగర్ బదిలీ

రాజమహేంద్రవరం రూరల్,ఆగస్టు 12: రాజమహేంద్రవరం రూరల్ రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ బి.రత్నసాగర్ బదిలీ అయ్యారు. ఆయనను డిప్యూటేషన్‌పై సీఎస్ డీటీగా ఉన్నతాధికారులు బదిలీ చేశారు.

ప్రజా సమస్యలపై 27 అర్జీలు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 12 : రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదికలో 27 అర్జీలు వచ్చాయి. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి కమిషనర్ కేతన్ గార్గ్ అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ అదనపు కమిషనర్ సత్యవేణి, ఎస్ఈ జి.పాండురంగారావు, సిటీ ప్లానర్ జీవీఎస్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు అందజేత

రాజమహేంద్రవరం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): గురుదేవ చారిటబుల్ ట్రస్టు సహకారంతో ముగ్గురు దివ్యాంగులకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ గంధం సునీత కృత్రిమ కాళ్లను అందజేశారు. అనంతరం సెప్టెంబరు 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో పెద్ద సంఖ్యలో కేసుల పరిష్కారంపై మునిసిపల్, విద్యుత్, కార్మిక, బ్యాంకు ప్రతినిధులతో సమావేశమయ్యారు.

వైసీపీకి చంటిబాబు రాజీనామా

దివాన్‌చెరువు, ఆగస్టు 12: బహుజన ఉద్యమాల ద్వారా ప్రజలను చైతన్యపరచడానికి పనిచేసిన దివాన్‌చెరువుకు చెందిన మార్గాని చంటిబాబు వైసీపీకి రాజీనామా చేస్తున్నట్టు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 15 ఏళ్లుగా సామాజిక ఉద్యమాల్లో పనిచేసిన తాను 2018లో వైసీపీలో చేరానని,వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. ఇకపైన తాను చేసే సామాజిక ఉద్యమాలకు, సేవలకు అందరూ సహకరించాలని కోరారు.

జాతీయ గ్రంథాలయ దినోత్సవం

దివాన్‌చెరువు, ఆగస్టు 12: గ్రంథాలయ నిర్వహణకు సంబంధించి గొప్ప పరిశోధనా శాస్త్రవేత్తగా డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ నిలిచారని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ అన్నారు. వర్శిటీలోని అంబేడ్కర్ కేంద్ర గ్రంథాలయంలో రంగనాథన్ జయంతి సందర్భంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. రిజిస్ట్రార్ సుధాకర్, వర్శిటీ అధికార్లు, అధ్యాపకులతో కలసి రంగనాథన్ చిత్రపటానికి నివాళులర్పించారు.



హర్ ఘర్ తిరంగా



మీకు..మేమున్నాం..



రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో హోం మంత్రి అనిత సోమవారం పర్యటించారు.. సెంట్రల్ జైలు అధికారులు ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను ప్రారంభించి.. మహిళా ఖైదీలతో ముచ్చటించారు. త్వరలోనే క్షమాభిక్ష పెడతామని తీపికబురు చెప్పారు. - వివరాలు మెయిన్‌లో

సెట్టు..బతికిస్తున్నారు..



సినిమా చెట్టును బతికించడానికి ప్రయత్నాలు ఆరంభమయ్యాయి. పది రోజుల కిందట కొవ్వూరు మండలం కుమారదేవంలోని సినిమా చెట్టు నేలవాలింది. ఆ చెట్టును బతికిస్తామని ఒక సంస్థ ముందు కొచ్చింది..సోమవారం చెట్టు పునరుజ్జీవం పనులు ఆరంభించారు.. - వివరాలు 8లో

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 12 : ఆజాదీకా అమృత్ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో సోమవారం జెండా పండుగను ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండా పాయింట్‌లో కలెక్టర్ ప్రశాంతి సెల్ఫీ ఫొటో దిగారు. కాన్వాస్‌పై కలెక్టర్ పి.ప్రశాంతి, ఇన్‌చార్జి జేసీ నరసింహరావు సంతకాలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ మంగళవారం ఉదయం రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల నుంచి ఆనంకళాకేంద్రం వరకు జెండా ర్యాలీ నిర్వహించే ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లావ్యాప్తంగా ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలన్నారు. హర్ ఘర్ తిరంగా యాత్రలు ,తిరంగా కచేరీలు,తిరంగా ప్రతిజ్ఞ చేయాలన్నారు. జెండాను ఎగురవేసి సెల్ఫీ తీసుకుని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని పిలుపునిచ్చారు.

అమ్మా..నాన్న జాగ్రత్త!



అమ్మాయిల చేయి వదలొద్దు..

- ప్రలోభాల్లో చిక్కుకుపోతున్నారు..
- తల్లిదండ్రులను వదిలేస్తున్న వైనం
- పెరుగుతున్న అదృశ్యం కేసులు
- ఐదేళ్లలో 188 మంది మిస్సింగ్
- మీ చుట్టూ తిరుగుతున్న మోసగాళ్లు
- పిల్లలపై ఒక కన్నేసి ఉంచాల్సిందే

అమ్మా నాన్న జాగ్రత్త.. అమ్మాయిల చేయి విడవొద్దు.. మహా మాయగాళ్లు ఉన్నారు..! కనిపెట్టుకుని ఉండండి.. కంటికి రెప్పలా కాపాడుకోండి.. లేదంటే మీ కళ్లెదుటే మోసం చేసేస్తారు.. మీకు తెలియకుండానే ఎత్తుకుపోతారు.. ధవళేశ్వరంలో పది రోజుల కిందట వెలుగు చూసి న ఒక సంఘటనే అందుకు ఉదాహరణ..భర్త అండ లేని ఒక మహిళను అక్కా అంటూ దగ్గరయ్యాడు.. ఆమె కూడా అలాగే భావించింది..అయితే తన ఇద్దరి కుమా ర్తెలపై కన్నేసి దగ్గరయ్యాడని మాత్రం అనుకోలేదు. ప్రస్తుతం అతడి నిజస్వరూపం తెలిసి లబోదిబోమంటుంది. ఆ తల్లికి వచ్చిన కష్టం ఎవరికీ రాకూడదంటే తస్మాత్ జాగ్రత్త.. అన్ని రోజులు మనవి కాదు కదా..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

అభూత కల్పనలను నిజమని నమ్ముతున్నారు. మాయ మాటలకు లొంగిపోతున్నారు.సెల్‌ఫోన్‌లో రంగుల ప్రపంచాన్ని కళ్ల ముందుకు తెచ్చేస్తానంటున్న కేటుగాళ్ల వలలో చిక్కుతున్నారు.చివరికి తల్లిదండ్రులను ఆవేదనలోకి నెట్టి 'వాడి'తో దూరమవుతున్నారు. కొద్ది రోజులకే ఊహించుకున్న రంగుల లోకం పటాపంచలు కావడంతో జీవచ్ఛవాల్లా మిగిలిపోతున్నారు.ఇలా ఎందరో బాలికలు కేటుగాళ్ల కూపంలో చిక్కుతూ తల్లిదండ్రులను శోకసంద్రంలో ముంచేస్తున్నారు.తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిక్షణం గమనిస్తూ ఉండడమే విరుగుడుగా కనిపిస్తోంది. పోలీసులు అదే హెచ్చరిస్తుండడంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

తల్లిదండ్రుల అప్రమత్తతే శ్రీరామరక్ష

పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు,ముఖ్యంగా బాలలైతే తల్లి నిఘా కచ్చితంగా ఉండాలి. సాధారణంగా 8వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ ఉరకలు వేసే వయసు 'తప్పు' చేసే అవకాశం ఎక్కువ. అందువల్ల తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి.స్నేహ పూర్వకంగా మాట్లాడాలి. పిల్లలు స్కూల్స్, కాలేజీలకు వెళ్లి వస్తున్నప్పుడు గమనించాలి. వారి తీరుపై తరచుగా చదివే చోట ఆరాతీయాలి.ట్యూషన్ల విషయంలో అప్రమత్తత అవసరం. ధవళేశ్వరం ఇద్దరు బాలికల కేసు ఇందుకు ఉదాహరణ. వారిని వెంట బెట్టుకొని తీసుకెళ్లిన యువ కుడు విజయనగరం జిల్లాలోని ఓ ఊర్లో ట్యూషన్లు చెప్పేవాడు. అక్కడ ట్యూషన్‌కి వచ్చే ఓ బాలికను మా యమాటలు చెప్పి తీసుకొచ్చేశాడు. పిల్లల ప్రతి క్షణాన్నీ గమనిస్తూ ఉండాలి. విలాసాలకు అలవాటు చేసే ముందు బాధ్యతలను తెలియజేయాలి.పిల్లల అలవాట్లు, సెల్‌ఫోన్ వాడకం, ప్రవర్తనల, హెయిర్ కటింగ్‌లపై కచ్చి తంగా దృష్టి పెట్టాలి.సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచే ప్రయత్నం చేయాలి.ఒకవేళ ఇవ్వాల్సి వస్తే నిఘా ఉంచాలి.

ఎందుకిలా?

గత వైసీపీ ప్రభుత్వంలో మిస్సింగ్ కేసులపై పూర్తి ఉదాసీనంగా వ్యవహరించడంతో పోలీసులు పెద్దగా శ్రద్ధ చూపించలేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, నిగ్గు తేలుస్తామని పవన్ కల్యాణ్ ప్రకటించడంతో తల్లిదండ్రులకు పెద్ద ఊరట లభించింది.అయితే మిస్సింగ్ కేసుల్లో పోలీసుల తీరు మాత్రం నేటికీ మారలేదని పరిస్థితులు చెబుతున్నాయి.కూటమి ప్రభుత్వం వచ్చాక రెండు కేసులు పరిశీలిస్తే ఈ విషయం రూఢీ అవుతుంది. నెల కిందట.. ఓ తల్లి పవన్ కల్యాణ్ దగ్గరకు వెళ్లారు. తన కూతురు 9 నెలల నుంచీ కనిపించడం లేదని.పోలీసులు అప్పటి నుంచీ దర్యాప్తు చేస్తున్నామనే చెబుతున్నారని తెలిపారు. పవన్ ఆదేశాలతో ఎక్కడో జమ్మూలో ఉన్న ఆ యువతిని పోలీసులు కేవలం రెండు రోజుల్లో తల్లి చెంతకు చేర్చారు. అలాగే.. ఇద్దరు బాలికలతో ఓ కేటుగాడు ఉడాయించాడు. ఆ తల్లి గత నెల 29న పోలీసులకు ఫిర్యాదు చేసింది. తర్వాత కేసులో పురోగతి లేదు. ఆమె నాలుగు రోజుల కిందట పిఠాపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వర్మ వద్దకు వెళ్లి విన్నవించింది.అప్పుడు దర్యాప్తు పరుగు పెట్టింది.రెండు రోజుల్లో బాలికల ఆచూకీని పోలీసులు పట్టేశారు.ఆ యువకుడిని కటకటాల వెనక్కి నెట్టారు. ఈ ఘటనలు పరిశీలిస్తే.. ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లి గోడు వెళ్లబోసుకున్న వారివిషయంలోనే వేగంగా న్యాయం దొరుకుతున్నట్లు స్పష్టమవుతోంది.మిస్సింగ్ కేసులను పోలీసుల ఒకే గాటన కట్టేస్తుండడం వల్ల ఇబ్బంది ఎదురవుతోంది.

188 మంది ఏమయ్యారో..

రక్షణగా ఉండాల్సిన వ్యవస్థలు అందరినీ ఒకే గాటన కట్టేసి దర్యాప్తుల్లో జాప్యం చేయడం వల్ల చాలా మంది ఏ కూపంలో కూరుకుపోయారో ఇప్పటికీ సమాధానం లేని ప్రశ్నగానే మిగిలిపోయింది. పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల కంటే రెండింతలు వెలుగు చూడని ఘటనలు ఉంటాయని చెబుతున్నారు. 2016 నుంచీ మిస్సింగ్ కేసులు పరిశీలిస్తే.. ఉమ్మడి, విభజిత తూర్పుగోదావరి జిల్లాలో బాలలు 21, బాలి కలు 70 మంది అదృశ్యమయ్యారు.గడిచిన ఐదేళ్లలో 18 మంది బాలికలు,170 మంది యువతుల ఆచూకీ లేదు. తాజాగా జరిగిన ఈ కేసు చూస్తే తప్పెవరిది? అనే ప్రశ్నకు పిల్లల చేయి వదిలేయడమే అనే సమాధానం వినవస్తోంది. ధవళేశ్వరంలో ఇద్దరు బాలికలను తనతో తీసుకెళ్లిపోయిన యువకుడి కేసు తల్లిదండ్రులకు తాజా హెచ్చరికను చేస్తోంది.ఓ గుర్తు తెలియని వ్యక్తి, అంతకు ముందు ఎన్నడూ చూడలేదు. రైల్వే ఉద్యోగమంటూ అబద్ధాలు చెప్పాడు.అప్పటికే తన కుమార్తెలు 'ఈడు'కు వచ్చారన్న సోయ కూడా ఆ తల్లిలో లేదు. వాడి మాయమాటలకు బుట్టలో పడింది.ఉద్యోగం వస్తే ఆర్థిక పరిస్థితి కొంత మెరుగు పడుతుందని ఆశ పడింది.ఈ క్రమంలో ఆ కేటుగాడు ఆ ఇద్దరు బాలిక లనూ అపహరించాడు. తన కూతుళ్ల విషయంలో కేటుగాడి ప్రవర్తను ఆ తల్లి పసిగట్టి అప్రమత్తమయితే ప్రమాదం ముంచుకొచ్చేది కాదు. ఇప్పుడు ఎవరికీ 'చెప్పుకోలేని' పరిస్థితి ఆ బాలికలకు దాపురించింది.

పిల్లల ప్రవర్తన గమనిస్తుండాలి



పిల్లల ప్రవర్తన..ముఖ్యంగా బాలికల తీరును తల్లి దం డ్రులు కచ్చితంగా గమనిస్తూ ఉండాలి. పిల్లలకు సెల్ ఫోన్ ఇస్తే నిఘా కచ్చితంగా ఉండాలి. బాలలపై కూడా దృష్టి సారించాలి. ఆడపిల్లలు ఒకవేళ ఎవరి ట్రాప్‌లో అయినా ఉన్నారని తల్లిదండ్రులు గమనిస్తే వెంటనే వారిని దగ్గరకు తీసుకొని స్నేహ భావంతో మాట్లాడాలి. మాట వినకపోతే పోలీసులకు విషయం చెప్పాలి.మేం ఆ పిల్లలకు కౌన్సెలింగ్ ఇస్తాం. వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం. స్కూలు యాజమాన్యాలు పిల్లలకు నైతిక విలువలు, మంచి నడవడిక గురించి నూరిపోస్తూ ఉండాలి. అందరం కలిసి పిల్లలను రక్షించుకుందాం.

- డి.నరసింహ కిషోర్, ఎస్పీ, తూర్పుగోదావరి.

జిల్లాలో పెరుగుతున్న హెచ్‌ఐవీ కేసులు

అంతర్జాతీయ యువజనోత్సవంలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, ఆగస్టు 12 : అంటువ్యాధులు లేకుండా నిర్మూలిద్దామని కలెక్టర్ పి.ప్రశాంతి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యువజనోత్సవంలో భాగంగా రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో సోమవారం హెచ్‌ఐవీపై మీకోసం చైతన్యండీ వార్మింగ్ డే కార్యక్రమాల పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు.సోమవారం నుంచి అక్టోబరు 13వ తేదీ వరకు 8 వారాల పాటు హెచ్‌ఐవీపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఆగస్టు 20న డీవార్మింగ్ డేను పురస్కరించుకుని అన్ని పాఠశాలల్లో విద్యార్థులు మధ్యాహ్నభోజన సమయంలో అల్బెండాజోల్ మాత్రలు వేసుకునేలా చూడాలన్నారు. ఈ రెండు కార్యక్రమాలపై ప్రజల్లో చైతన్యం తేవాలన్నారు. ఈ నెల 28న మరోసారి మిగిలిన పిల్లలకు అల్బెండాజోల్ మాత్రలు అందించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 1 నుంచి 19 ఏళ్ళ వయస్సు కలిగిన వారు 4,30,339 మంది ఉన్నట్టు తెలిపారు. హెచ్‌ఐవీ ప్రభావం తక్కువగా ఉన్నప్పటికి జిల్లాలో కేసుల నమోదు ఎక్కువగా ఉందన్నారు. దేశంలో 2030 నాటికి హెచ్‌ఐవీ, ఎయిడ్స్ , ఇతర అంటువ్యాధులను అంతం చేయాలనే లక్ష్యంతో కార్యాచరణ సిద్ధం చేసినట్టు తెలిపారు. 1097 హెచ్‌ఐవీ హెల్ప్‌లైన్ నెంబర్ అన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి జేసీ జి.నరసింహులు, డీఎంహెచ్‌వో కే.వెంకటేశ్వరరావు, ఎన్.వసుంధర తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మికుల గుర్తింపునకు ప్రత్యేక డ్రైవ్

నల్లజర్ల,ఆగస్టు 12 : బాలబాలికలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని నిడదవోలు అసిస్టెంట్ లేబర్ అధికారి(ఏఎల్‌వో)పి.శాంతిరాజు హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నల్లజర్లలో స్పెషల్ టీం (రాజమహేంద్రవరం పోలీసులు, లేబర్ అధికారులు)నల్లజర్ల మండలంలో సోమవారం విస్తృత తనిఖీలు చేశారు. నెల రోజులపాటు స్పెషల్ డ్రైవ్ ఉంటుందని తెలిపారు. 18 సంవత్సరాల్లోపు పిల్లలను పనిలో పెట్టుకున్న సంస్థల యాజమానులపై కేసులు నమోదు చేసి కోర్టుకు పంపిస్తామన్నారు. నల్లజర్లలో బైక్ మెకానిక్ వద్ద పని చేసిన బాలుడు,కుసుమ ట్రేడర్‌లో పని చేస్తున్న బాలిక,మగ్గం వర్క్ వద్ద పనిచేస్తున్న బాలుడిని గుర్తించి కేసులు నమోదు చేశారు. పిల్లలను తల్లిదండ్రులు చదివించలేని స్థితిలో ఉంటే తామే హాస్టల్‌లో ఉంచి చదివిస్తామన్నారు.ఎస్‌ఐ వాణి ఉన్నారు.

కేటుగాడు.. అరెస్టు 8

ఎవరి పని.. వారిదే!



ఇదీ సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలోని చిత్రం.. ఈ చిత్రంలో ఫోన్‌లు చూస్తున్నవారు.. నిలబడి మాట్లాడుకుంటున్నవారు ఎవరో తెలుసా.. వీరంతా అర్జీదారులు కాదండోయ్.. జిల్లాస్థాయి అధికారులేనండి.. కలెక్టర్ రాకపోవడంతో ఎవరిష్టం వారిది.. ప్రతి సోమవారం ఇంతే.. ప్రభుత్వం మారినా పాత వాసనలు ఇంకా పోలేదు..

కలెక్టర్ లేకపోతే అర్జీదారులను పట్టించుకోని అధికారులు

- మారని ఉన్నతాధికారుల తీరు
- ప్రజల సమస్యలపై చిన్నచూపు
- కలెక్టర్ ఉంటేనే శ్రద్ధ..లేదంటే అశ్రద్ధే
- కలెక్టరేట్‌లో 187 అర్జీల స్వీకరణ
- ఇదీ ప్రజా సమస్యల పరిష్కారవేదిక తీరు

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, ఆగస్టు 12 : ప్రభుత్వం మారినా పాత వాసన పోలేదు.కొన్ని విధానాల్లో మార్పులు రాలేదు. ఇంకా పాత విధానంలోనే ప్రభుత్వ కార్యక్రమాలు జరుగుతున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి స్పందన స్థానంలో ప్రజాసమస్యల పరిష్కారవేదిక మీ కోసం కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుంది. అయితే అధికారుల తీరులో మాత్రం మార్పుకాన రావడం లేదు. వచ్చామా..వెళ్లామా అన్నట్టే ఉంటున్నారు. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం జరిగే ప్రజాసమస్యల పరిష్కారవేదిక తీరు పలు విమర్శలకు తావిస్తోంది.జిల్లా కలెక్టర్ స్వయంగా అర్జీలు స్వీకరించినప్పుడు ఉన్న అప్రమత్తత ఆమె లేని సమయాల్లో కానరావడం లేదు. ఉన్నతాధికారులు స్వయంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించినా ఆ సీరియస్‌నెస్ కనిపించడంలేదు.



కలెక్టర్ కోసం ఎదురు చూస్తున్న అర్జీదారులు

సిట్టింగ్ అయోమయం

ప్రజాసమస్యల పరిష్కారవేదిక నిర్వహించే హాలులో అధికారులు కూర్చునే సిట్టింగ్ అయోమయంగానే ఉంటుంది. గతంలో కూడా ఇదే పరిస్థితి. ఏ అధికారి ఎక్కడ ఉన్నారో స్పష్టంగా తెలిసేలా ఆయా ప్రభుత్వ శాఖల నేమ్ బోర్డులను వారి టేబుల్స్‌పై ఏర్పాటు చేస్తే ఏ శాఖ అధికారులు ఎంత మంది వచ్చారనేది స్పష్టంగా తెలుస్తుంది. కానీ కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం అధికారులు, సిబ్బంది మూకుమ్మడిగా హాలులో కూర్చోవడం. ఏఏ శాఖలు వచ్చాయో ఆఖరిలో రిజిస్టర్ చూస్తే గాని తెలియని పరిస్థితులు ఉన్నాయి. కలెక్టర్ కూడా జిల్లాస్థాయి అధికారులను పిలిచేటప్పుడు హాలులో ఎటు కూర్చున్నారో తెలియక అటు ఇటు చూసి పిలవడం జరుగుతుంది.ఈ పరిస్థితి లేకుండా విభాగాల వారీగా సిట్టింగ్‌లు ఏర్పాటు చేసి ఆయా శాఖల టేబుల్ బోర్డులను ఏర్పాటు చేస్తే అయోమయం ఉండదనే వాదన వినిపిస్తోంది

187 అర్జీల స్వీకరణ

ప్రజాసమస్యల ఫిర్యాదుల పరిష్కారం దిశగా క్షేత్రస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని.. ప్రజల నమ్మకాన్ని పెంచే దిశగా అధికారుల పనితీరు ఉండాలని కలెక్టర్ ప్రశాంతి సూచించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై జూమ్ యాప్ ద్వారా డివిజన్ ,మండల అధికారులతో చర్చించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదికలో 187 అర్జీలను స్వీకరించారు. తొలుత జిల్లా ఇన్‌చార్జి జేసీ, డీఆర్‌వో నరసింహరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. నిడదవోలుకు చెందిన కారింకి వెంకన్నకు చెందిన సర్వే నెం 142/8 కొత్త సర్వేనెంబరు 890/5లో భూమిలో వారి కుమారులు 50 ఏళ్ళుగా సాగుచేసుకుంటుండగా చెరుకు శ్రీనివాస్ తమ భూమిపై లేనిపోని పిటిషన్లు పెట్టి బెదిరిస్తున్నాడని అతని భారి నుంచి రక్షణ కల్పించాలని అర్జీపెట్టుకున్నారు. వీరితో పాటు నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు కలెక్టరేట్‌కువచ్చి అధికారులతో మాట్లాడి బాధితులకు న్యాయంచేయాలని తెలిపారు. దివ్యాంగ బ్యాగ్ లాగ్‌పోస్టుల భర్తీ, చేతి వృత్తుల వ్యాపారం చేసే దివ్యాంగుల బ్యాంకు రుణాలకు చర్యలు తీసుకోవాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు యనమదల వెంకటేశ్వరావు, జిల్లా అధ్యక్షుడు అంగర గంగారామ్ విజ్ఞప్తి చేశారు. సీతానగరం మండలం రాపాక-చినకొండేపూడి గ్రామాల మధ్య పుంతరోడ్డు కబ్జాకు గురైందని.. వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరారు. ప్రజాసమస్యల పరిష్కారవేదికలో రెవెన్యూ విభాగానికి 71, పోలీస్ శాఖకు 30, పౌరసరఫరాల శాఖకు 26 ,పంచాయతీరాజ్ 25, ఇతర శాఖలకు 35 అర్జీలు వచ్చాయి.



కలెక్టర్ రావడంతోనే చుట్టుముట్టిన అర్జీదారులు

కలెక్టర్ లేకపోతే అర్జీదారులు వెనక్కు.

కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కారవేదికలో కలెక్టర్ పి.ప్రశాంతి పాల్గొంటేనే నేరుగా అర్జీలు ఇవ్వడానికి ప్రజలు సముఖత వ్యక్తం చేస్తున్నారు. అనివార్య కారణాల వల్ల కలెక్టర్ హాజరుకాకపోతే ప్రజలు ఉన్నతస్థాయి అధికారులకు అర్జీలు ఇవ్వడానికి ఇష్టపడడం లేదు.కలెక్టర్ రిసీవింగ్, సమస్య క్షుణంగా పరిశీలన చేయడం సంబంధిత అధికారులతో వెంటనే మాట్లాడటం, ప్రజలకు స్పష్టమైన హామీ ఇవ్వడంతో ప్రజలు కలెక్టర్‌నే స్వయంగా కలవడానికి ఇష్టపడుతున్నారు. రాజమహేంద్రవరంలో సోమవారం హోంమంత్రి పర్యటన నేపథ్యంలో కలెక్టర్ అధికారిక కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లడంతో ప్రజాసమస్యల పరిష్కారవేదికకు ఉదయం హాజరుకాలేదు.మధ్యాహ్నం తర్వాత కలెక్టర్ నేరుగా కలెక్టరేట్‌కు వచ్చారు. అప్పటి వరకు కలెక్టర్ కోసం చాలా మంది ఉండిపోయారు. కలెక్టర్ ప్రశాంతిని కలిసి అర్జీలను ఇచ్చాకే ప్రజలు వెనుతిరిగారు.

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఉపాధ్యాయుల పని సర్దుబాటులో లోపాలు

ఉపాధ్యాయ సంఘ సమాఖ్య నాయకులు.. తహశీల్దార్‌కు వినతి



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

దేవరపల్లి, ఆగస్టు 12: రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలలో పని సర్దుబాటులో భాగంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేసే ప్రక్రియను ప్రారంభించారని దీనిలో కొన్ని విధానపరమైన నిర్ణయాలు సరిగా లేవని ఉపాధ్యాయ సంఘ సమాఖ్య (ఫ్యాప్టో) నాయకులు లింగంపుంత రామారావు, నాగేంద్రప్రసాద్, పి.గంగరాజు, ఓరుగంటి శివనాగప్రసాద్ అన్నారు. దేవరపల్లిలోని జడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన నిర్వహించి వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈవోలు తిరుమలదాసు, అప్పారావులకు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘం నాయకులు మాట్లాడుతూ జీవో 117ను రద్దు చేయాలని, హైస్కూళ్లలో సెక్షల వారీగా కాకుండా విద్యార్థి, ఉపాధ్యాయుల సంఖ్యను బట్టి జరగాలని కోరారు. పని సర్దుబాటు సమయంలో సీనియర్లకు విల్లింగ్ అవకాశం కల్పించాలని, 70శాతం పైబడి దివ్యాంగత్వం కలిగిన ఉపాధ్యాయులను మినహాయించాలని అన్నారు. ప్రైమరీ హెడ్‌మాస్టారు పోస్టులను విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా కొనసాగించాలని, ఆరు నుంచి పదో తరగతి 10 సెక్షన్‌లు దాటిన సందర్భంలో ఇద్దరు ఇంటి ఉపాధ్యాయులు, ఇద్దరు పీఎస్‌పోస్టులను కేటాయించాలన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాల నిర్ణయం మేరకే సర్దుబాటు ప్రక్రియను చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు ఉమాకాంత్, ఎంఎస్ మహాలక్ష్మి, మాధవరపు నాగేశ్వరరావు, శ్యామ్‌సుందర్, చాపల శ్రీనివాస్, అబ్బులు, ఉదయ్‌కుమార్, రమాజానకి, బుజ్జిబాబు పాల్గొన్నారు.

తాళ్లపూడి తహశీల్దార్‌గా రవీంద్రనాథ్



తాళ్లపూడి, ఆగస్టు 12: తాళ్లపూడి తహశీల్దార్‌గా బీరా రవీంద్రనాథ్ సోమ వారం బాధ్యతలు చేపట్టారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలంలో ఎన్నికల అధికారిగా విధులు నిర్వహించి బదిలీపై తాళ్లపూడి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో డీటీ భారతి, ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు, వీఆర్వోలు సిబ్బంది పాల్గొన్నారు.

1500 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత

తాళ్లపూడి, ఆగస్టు 12: తాళ్లపూడిలో ఆదివారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ బీట్ నిర్వహిస్తుండగా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని గుర్తించామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. గొడౌన్ నుంచి వచ్చిన గన్నీ బ్యాగ్స్‌తోనే తరలిస్తున్న 50కిలోలున్న 30 బస్తాలను వాహనంతో సహా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి తదుపరి చర్యలకై సివిల్ సప్లై అధికారులకు అప్పగించామని చెప్పారు. కాగా ఎవరైనా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో దొరికితే మొదటిసారి రూ.10 వేలు జరిమానా, రెండో సారి దొరికితే జైలుకెళ్లడం ఖాయమని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడుపరాదని ఎస్ఐ అన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో తపస్వీరెడ్డి ప్రతిభ



నిడదవోలు, ఆగస్టు 12: నిడదవోలుకు చెందిన విద్యార్థి తపస్వీరెడ్డి పల్నాడు జిల్లా నర్సరావుపేటలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి ఓపెన్ చెస్-2024 పోటీల్లో అండర్ 11 విభాగంలో 5వ స్థానంలో నిలిచి బహుమతిని గెలుచుకున్నాడు. దీంతో తపస్వీరెడ్డిని పట్టణ, మండల క్రీడాకారులు ప్రత్యేకంగా అభినందించారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



ఉండ్రాజవరంలో రంగనాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, ఆగస్టు 12: గ్రంథాలయాల ద్వారా ప్రజలు విజ్ఞానాన్ని పొందాలని రిటైర్డ్ అధ్యాపకుడు కోట రామప్రసాద్ చెప్పారు. సోమవారం జాతీయ గ్రంథాలయ దినోత్సవం, గ్రంథాలయ ఉద్యమ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ 132వ జయంతి సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వాటిని పిల్లలు, పెద్దలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తొలుత రంగనాథన్ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో రీడర్స్ ఫోరం సభ్యుడు ఆకెళ్ల శ్రీనివాస్, గ్రంథ పాలకుడు జి.కృష్ణారావు, పాఠకులు ఎంవీ కృష్ణారావు, పి.సత్యనారాయణమూర్తి, జి.సురేష్, వి.చంద్రరావు, బి.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

నారా లోకేశ్‌ను కలిసిన యువగళం టీం



తాళ్లపూడి, ఆగస్టు 12: రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్‌ను అల్లూరి విక్రమాదిత్యతో ఉండవల్లిలోని ఆయన నివాసంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశామని టీడీపీ యువగళం టీం కాకర్ల సత్యేంద్ర తెలిపారు. నియోజకవర్గంలోని పలు సమస్యలపై ఆయనతో చర్చించినట్టు చెప్పారు. కార్యక్రమంలో నాదేళ్ల శ్రీరాం, కూచిపూడి లక్ష్మణరావు, మద్దిపట్ల సురేష్, కూచిపూడి గణేష్, బొడ్డు కేశవ, కొడవటి రవి, రమణ పాల్గొన్నట్టు చెప్పారు.

సినిమా చెట్టు పునరుజ్జీవం పనులు



సినిమాచెట్టు మొదలను పైకిలేపిన దృశ్యం

కొవ్వూరు, ఆగస్టు 12: కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామంలో నెలకొరిగిన సినిమా చెట్టు మానులను పైకిలేపే పనులను ప్రారంభించారు. సినిమా చెట్టు ఇటీవల కురిసిన వర్షాలకు రెండుగా చీలి నెలకొరిగింది. రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్ సభ్యులు చెట్టును పునరుజ్జీవం పనులు చేపట్టారు. నెలకొరిగిన చెట్టు కొమ్మలకు లేపనాలు పూశారు. సోమవారం చెట్టు కొమ్మలను పూర్తిగా కత్తిరించి రెండుగా విడిపోయిన మాను బాగాలను పైకిలేపి ఒక్కటిగా కలిపే పనులను చేపట్టారు.

తహశీల్దార్‌గా మెరికమ్మ బాధ్యతల స్వీకరణ

చాగల్లు, ఆగస్టు 12: చాగల్లు తహశీల్దార్‌గా మెరికమ్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులను ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా టీడీపీ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు జొన్నకూటి సుబ్బారావు ఆధ్వర్యంలో పలువురు ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు సక్రమంగా అందించేలా కృషిచేయాలని, ముఖ్యంగా దళితులకు అధిక ప్రాధాన్యమివ్వాలని కోరారు. కార్యక్రమంలో బి.సుధీర్, జె.ఆనంద్‌బాబు, ఎం.ఆకాష్, బి.బన్ను, ఎస్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి

నిడదవోలు, ఆగస్టు 12: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో సోమవారం పొలంలో పనులు చేసుకొంటున్న కౌలు రైతు మరపట్ల గంగరాజు (40) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్టు స్థానికులు తెలిపారు. దీనిపై నిడదవోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్ట్స్ కళాశాలలో అథ్లెటిక్స్ సెలక్షన్స్

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 12 : రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో సోమవారం క్రీడాకారుల సెలక్షన్స్ నిర్వహించారు. సెప్టెంబరులో గుంటూరు ఆచార్య నాగార్జున వర్సిటీలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారు.

కానరాని మార్పు

'మీ కోసం'కు గైర్హాజరవుతున్న అధికారులు

- నిడదవోలులో 25 మందికి గాను 13 మంది హాజరు
- ప్రత్యక్షంగా ఉన్నది ఎనిమిది మంది మాత్రమే



నిడదవోలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు హాజరైన అధికారులు



అధికారుల అటెండెన్స్

నిడదవోలు, ఆగస్టు 12: ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం, డివిజినల్ కార్యాలయం, మున్సిపల్, మండల రెవెన్యూ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం వరకు అధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉండి వారు అందించే అర్జీలను స్వీకరించాలి. దీనికోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (మీ కోసం) అనే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన చేసింది. అయితే క్షేత్రస్థాయిలో అధికారులు ఈ కార్యక్రమానికి గైర్హాజవుతున్నారు. కొందరైతే రిజిస్టరులో సంతకం చేసి వెళ్లిపోతున్నారు. వివరాల్లోకి వెళితే సోమవారం నిడదవోలులోని తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (మీ కోసం) అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచింది. మీ కోసం జరుగుతున్న కార్యాలయాన్ని ఉదయం 11.40గంటలకు ఆంధ్రజ్యోతి విజిట్ చేయగా 25 మంది మండల స్థాయి అధికారులు హాజరు కావలసిన మీ కోసం కార్యక్రమానికి అటెండెన్స్ రిజిస్టరులో 13 మంది మాత్రమే సంతకాలు చేసి ఉండగా ప్రత్యక్షంగా 8 మంది మాత్రమే కార్యాలయంలో ఉన్నారు. దీంతో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు అధికారులు ఇస్తున్న ప్రాముఖ్యత ఏపాటిదో తెలుస్తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా అధికారుల్లో ఇంకా మార్పు రాలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు అధికారులు హాజరయ్యేలు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కొవ్వూరుతో అనుబంధం మరిచిపోలేనిది

- నియోజకవర్గ అభివృద్ధికి కృషి : హోం మంత్రి అనిత



పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న హోంమంత్రి అనిత

కొవ్వూరు, ఆగస్టు 12: కొవ్వూరు ప్రజలు, నాయకులతో అనుబంధం మరిచిపోలేనిదని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. కొవ్వూరులో టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు నివాసానికి విందుకు విచ్చేసిన ఆమె మాట్లాడుతూ 2019లో కొవ్వూరు నియోజకవర్గంలో టీడీపీ తరఫున పోటీ చేశానని, నాయకులు, కార్యకర్తలు సొంత బిడ్డలా చూసుకున్నారన్నారు. నా పుట్టింటికి వచ్చినట్లుగానే కొవ్వూరు నియోజకవర్గానికి వస్తుంటానన్నారు. ద్విసభ్య కమిటీని ఉద్దేశించి మాట్లాడుతూ ఈ అన్నదమ్ముల మధ్యలో ఆడబిడ్డలా అనుబంధం ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నానన్నారు. తరచుగా తమ అనుమతితోనే కొవ్వూరు వస్తుంటానని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఇదిలా ఉండగా కొవ్వూరులో పోలీస్‌స్టేషన్, సబ్‌జైలు నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే ముప్పిడి కోరారు. దానిపై మంత్రి స్పందిస్తు ప్రతిపాదనలు, ఎస్టిమేట్లు తయారుచేసి పంపిస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిర్మాణపనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మాజీ ఎమ్మెల్యేలు టీవీ రామారావు, బూరుగుపల్లి శేషారావు, నియోజకవర్గ పరిశీలకుడు గొర్రెల శ్రీధర్, నాయకులు దాయన రామకృష్ణ, సూర్యదేవర రంజిత్, బేతిన నారాయణ, జొన్నలగడ్డ శ్రీనివాస్, ఎంపీపీ కాకర్ల నారాయుడు, పిల్లలమర్రి మురళీకృష్ణ, బోడపాటి ముత్యాలరావు, మద్దిపాటి సత్యనారాయణ, అర్జిల్లి రామకృష్ణ, పెనుమాక జయరాజు, కాగిత రఘు, కలగర సుబ్బారావు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో యువత భవిష్యత్‌కు చేటు

- 'నషా ముక్త్ భారత్ అభియాన్'లో సబ్ కలెక్టర్ శ్రీవాస్తవ



ప్రతిజ్ఞ చేస్తున్న సబ్ కలెక్టర్ శ్రీవాస్తవ

కొవ్వూరు, ఆగస్టు 12: మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు యువత భవిష్యత్‌ను పాడుచేయడంతో పాటు, జైలుకు పంపిస్తాయని సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. కొవ్వూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఐసీడీఎస్ సీడీపీవో డి.మమ్మీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులతో డ్రగ్స్ ఫ్రీ ఇండియా ప్రతిజ్ఞను చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర సామాజిక న్యాయ మంత్రిత్వశాఖ నేతృత్వంలో గంజాయి, డ్రగ్స్ నివారణకు అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థి దశలో ఫ్యాషన్‌గా ప్రారంభమై చెడు వ్యసనాలతో భవిష్యత్‌తో పాటు, కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. సమస్యలు ఎదురయినప్పుడు కళాశాలలో అధ్యాపకులతో గాని, తలిదండ్రులతో గాని చెప్పి పరిష్కరించుకోవాలన్నారు. అధ్యాపకులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. సినిమాల్లో మంచిని మాత్రమే గ్రహించాలని, చెడును కాదన్నారు. సీఐ పి.విశ్వం మాట్లాడుతూ చదువు భవిష్యత్‌ను మారుస్తుందన్నారు. డ్రగ్స్ కలిగి ఉంటే కేసులు నమోదు చేసి ఏడు నుంచి పదేళ్ల జైలు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.సతీష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బి.ఉదయభాను, ఆర్.విజయలక్ష్మి, కేవీ పద్మిని, జి.ఆదిలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు. అలాగే సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, కార్యాలయ సిబ్బందితో డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవో జీఎస్ఎస్ జవహర్ బాజి, కె.రవివిక్రమ్, ఏడీఏ పి.చంద్రవేఖర్, హార్టీకల్చర్ అధికారి పీహెచ్ శ్రీనివాస్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 4 ఫిర్యాదులు

స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 4 ఫిర్యాదులు స్వీకరించినట్టు సబ్ కలెక్టర్ శ్రీవాస్తవ తెలిపారు. ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల డివిజనల్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

బాధ్యతలు, విధులపై అవగాహన పెంచుకోవాలి

- నిడదవోలు ఎంపీడీవో ఝాన్సీ
- సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు



నిడదవోలు: సమిశ్రగూడెంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఝాన్సీ

నిడదవోలు, ఆగస్టు 12: సర్పంచులు, కార్యదర్శులు తమ బాధ్యతలు, విధులపై అవగాహన పెంపొందించుకోవాలని ఎంపీడీవో జేఏ ఝాన్సీ అన్నారు. సోమవారం నిడదవోలు మండలం సమిశ్రగూడెంలోని మండల పరిషత్ కార్యాల యంలో సర్పంచులు, కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణా శిబిరంలో ఆమె మాట్లా డుతూ గ్రామాల్లో పరిపాలనపై సర్పంచులు, స్థానిక అధికారులు సమన్వయంతో పనిచేసుకోవాలన్నారు. గ్రామాల్లో సర్పంచులు అభివృద్ధి మౌలిక సదుపా యాల కల్పనపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పీవోపీఆర్డీ సుంకర మల్లిక తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు: మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణా తరగతులను ఎంపీపీ కాకర్ల నారాయుడు ప్రారంభించి మాట్లాడారు. పంచాయతీ నిధులను గ్రామంలో పారిశుధ్యం, తాగునీరు సరఫరా, విద్యుత్ దీపాల నిర్వహణకు వినియోగించాలన్నారు. గ్రామాభివృద్ధికి మండల పరిషత్ నిధులు కేటాయిస్తామన్నారు. ఎంపీడీవో కె.సుశీల మాట్లాడుతూ ఈ నెల 12,13,14 తేదీల్లో సర్పంచ్‌లు, కార్యదర్శులకు రిఫ్రెషన్ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని, సర్పంచ్‌లు పాల్గొని సర్టిఫికెట్లు పొందాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీలు వై.అలేఖ్య సువర్చలా, సీహెచ్ ఆశా అలేఖ్య, డి.ముత్యం, కేఎస్‌వీ వీరన్న పాల్గొన్నారు.



దేవరపల్లిలో జాతీయ జెండాలతో ర్యాలీ చేస్తున్న సర్పంచ్‌లు, కార్యదర్శులు

గోపాలపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన మొదటి రోజు శిక్షణ తరగతిని ఎంపీడీవో కె.రమేష్ ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్యం, తడిచెత్త, పొడిచెత్త నిర్వహణ, వీధి దీపాల నిర్వహణతో పాటు అభివృద్ధి ప్రణాళికలపై సర్పంచ్‌లు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రస్తుతం చెత్తాచెదారంతో గ్రామ శివారులు స్వాగతం పలుకుతున్నాయని దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. తడిచెత్త, పొడిచెత్త విడివిడిగా సేకరించి చెత్తసంపద తయారి కేంద్రాలకు పంపించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాస్, శిక్షకులు సురేష్, నాగేశ్వరరావు, తాతబాబు పాల్గొన్నారు.

దేవరపల్లి: దేవరపల్లిలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాలతో ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఎంపీడీవో ప్రభాకర్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సర్పంచ్‌లు, కార్య దర్శులకు 3 రోజుల శిక్షణా కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. ఎంపీడీవో ప్రభాకరరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరు పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. చట్టాలపై కూడా పూర్తిగా అవగాహన ఉంటే మంచి పరిపాలన అందించవచ్చన్నారు. సర్పంచ్‌లు, కార్యదర్శులతో ప్రతిజ్ఞ చేయించారు.

ప్రతిఒక్కరిలో జాతీయ భావాన్ని పెంపొందించాలి

- హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ఎంపీపీ సత్యనారాయణ



చాగల్లులో మత్తుపదార్థాల నిషేధంపూ ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

గోపాలపురం, ఆగస్టు 12: భారతదేశంలో పుట్టిన ప్రతిఒక్కరిలో జాతీయ భావాన్ని పెంపొందించాలని ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ అన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా స్థానిక జడ్పీ హైస్కూల్లో జాతీయ జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కె.రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంపీపీ మాట్లా డుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాల న్నారు. ప్రతిఒక్కరిలో దేశభక్తి పెంపొందినపుడే సామాజిక సేవా గుణం అలవాటవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో జీ.శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి రాజారావు, ఎస్ఐ కే.సతీష్, టీడీపీ మండలాధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ, జ్యేష్ఠ శ్రీధర్, కూనపం ప్రసాద్ బాబు, కొడవటి చినవెంకటేశ్వరరావు, కొడవటి శ్రీను, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చాగల్లు: చాగల్లులో భారీ జాతీయ జెండాతో ఊరేగింపు నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే మార్గం వరకు మెయిన్‌రోడ్డుపై ప్రభుత్వ ఉద్యోగుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. మాదక ద్రవ్యాల వినియోగం నిషేదిద్దామంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు మత్తుపదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.బుజ్జి, తహశీల్దార్ ఎం.మెరికమ్మ, పంచాయతీ కార్యదర్శి ఎల్.రవికుమార్, నాయకులు నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి, కరుటూరి సతీష్, కేతా సాహెబ్, డి.రామకృష్ణ, గ్రంధి రాంబాబు, మద్దిపాటి సురేష్, అంగన్‌వాడి సిబ్బంది, జడ్పీ హైస్కూల్, శ్రీరాజరాజేశ్వరి విద్యాలయ విద్యార్థులు, పాల్గొని నినాదాలు చేశారు. భారతమాత, మహాత్మగాంధీ, అల్లూరి సీతారామ రాజు వేషధారణలలో పాల్గొన్న చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.



కేటుగాడి వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

కేటుగాడు.. బాలికలే టార్గెట్

ఇద్దరు బాలికల కిడ్నాప్ కేసును చేధించిన పోలీసులు

రాజమహేంద్రవరం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): అతడో కేటుగాడు.. బాలికలే అతడి టార్గెట్.. ఇద్దరు బాలికలకు మాయమాటలు విసిరిన కేటుగాడిని పోలీసులు కటకటాల్లోకి నెట్టి వారిని రక్షించారు. ఈ కేసు వివరాలను తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ సోమవారం వెల్లడించారు.ఒడిశాలోని బరంపురానికి చెందిన ఒక మహిళ తన భర్తతో విడిపోయి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడితో తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలో నివాసం ఉంటోంది.కుమార్తెలు కాకినాడలోని ఒక హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు.ఈ ఏడాది వేసవి సెలవుల్లో ఇంటికి వచ్చారు. అప్పటికే నాలుగు నెలల కిందట విజయనగరం జిల్లా బత్తిరాజేరు మండలం పెదమన్నాపురానికి చెందిన మారోజు వెంకటేష్ రైల్వేలో టీసీని అంటూ ఆమె ఉంటున్న ఇంటి పైగదిలో అద్దెకు దిగాడు. అప్పటికే అతడితో ఒక 17 ఏళ్ల బాలిక ఉంది. ఆమెను చెల్లిగా అందరి వద్దా చెప్పేవాడు. బాలికల తల్లిని అక్కా అని పిలుస్తూ మచ్చిక చేసుకున్నాడు. గతనెల 10న తల్లికి రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి చిన్న కుమార్తెతో కలిసి విజయవాడ తీసుకెళ్లి ఒక లాడ్జిలో ఉంచాడు. తర్వాత ధవళేశ్వరం వచ్చి ఆమె కుమారుడిని కూడా ఆమె ఉంటున్న లాడ్జి వద్దకు తీసుకొచ్చి అప్పగించాడు. అక్కడున్న చిన్న కుమార్తెను తీసుకొని గతనెల 21న ధవళేశ్వరం వచ్చాడు. ఇద్దరు బాలికలనూ హాస్టల్‌కి తీసుకెళుతున్నానని చెప్పాడు. ఇద్దరితోనూ తల్లితో మాట్లాడించాడు. తర్వాత వీళ్లను ఒక లాడ్జిలో ఉంచి విజయవాడ కూడా వెళ్లొచ్చాడు.28వ తేదీ నుంచి వెంకటేష్ ఫోన్ స్విచ్ఛాఫ్ రావడం, వాకబు చేయగా హాస్టల్‌కి పిల్లలు చేరుకోలేదని తెలిసి తల్లిలో కంగారు మొదలైంది. వెంటనే ధవళేశ్వరం చేరుకుని 29వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై మిస్సింగ్ కేసు నమోదు చేసి వెంటనే నాలుగు పోలీసు బృందాలను ఏర్పాటు చేసి విజయవాడ, గుంటూరు, కర్నూలు, నెల్లూరు, హైదరాబాదు, విజయనగరం జిల్లాలకు పంపించామని ఎస్పీ వివరించారు. నెల్లూరులో ఉన్నట్టు గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. ధవళేశ్వరంలో మోసగాడితో ఉండే 17ఏళ్ల బాలికను విజయనగరం నుంచి తీసుకొచ్చినట్టు సమాచారం. దీనిపై అక్కడి పెదమన్నాపురం పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. ఆ బాలికను పది రోజుల్లో వచ్చి పెళ్లి చేసుకుంటానని గత నెల 28వ తేదీ ఉదయం రాజమండ్రిలో విశాఖ బస్సు ఎక్కించి విజయనగరం వెళ్లిపోవాలని చెప్పినట్టు పోలీసులు గుర్తించారు.

బాలికలకు వేరే కథ చెప్పి..

తండ్రిని చంపిన కేసులో మీ తల్లిని పోలీసులు జైలుకు పంపించారని నిందితుడు వెంకటేశ్ ఆ బాలికలు ఇద్దరికీ ఓ కథ అల్లాడు. మీ తల్లి ఇక ఇప్పట్లో రాదని పిల్లలకు చెప్పి.. తాళి కట్టి లోబరుచుకున్నాడని ఎస్పీ తెలిపారు. ఉద్యోగ నిమిత్తం అని చెప్పి తల్లి ఫోన్ కూడా ఇతడి వద్ద ఉండడంతో ఆమె ఖాతాలోని రూ.2లక్షలను తన ఖాతాలోకి బదిలీ చేసుకు న్నాడని చెప్పారు.ఇతడు చేస్తున్న ఇన్‌స్టాగ్రాం రీల్స్, రైల్వే ఉద్యోగిగా నటనకు తల్లి, పిల్లలు ప్రభావితం అయ్యారని ప్రాథమికంగా అంచనాకు వచ్చామన్నారు. వెంకటేశ్ నుంచి రైల్వే టీసీలు తీసుకెళ్లే బ్యాగు, చలానా పుస్తకాలు, నకిలీ ఐడీ కార్డు, మూడు సెల్‌ఫోన్లు, రూ.69వేల నగదు స్వాధీ నం చేసుకొని పోక్సో తదితర చట్టాల కింద మొత్తం ఏడు సెక్షన్లతో కేసు నమోదు చేశామని ఎస్పీ పేర్కొన్నారు. బాలికలను సంరక్షణ కేంద్రానికి అప్పగించామని చెప్పారు. బాలికలను లాడ్జీలకు తీసుకె ళ్లినా ఆ యాజమాన్యాలు బాధ్యతా రహితంగా ప్రవర్తించడంపై కేసులు నమోదు చేసే యోచ నలో ఉన్నామన్నారు.కేసు దర్యా ప్తులో ప్రతిభ చూపిన సౌత్ జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్, సీఐలు జీవీ వినయ్ మోహన్, టి.గణేశ్, బి.సూర్య అప్పారావు, ఎస్ఐలు బి.హరిబాబు,టి.క్రాంతికుమార్, బి.నాగ దుర్గాప్రసాద్, ఎం.అయ్యప్ప రెడ్డి, బి.వినోద్, చావా సురేశ్ తదితర సిబ్బందిని, కేసు విషయంలో కీలకమైన సమాచారం ఇచ్చిన నెల్లూరులోని ఓ పాత్రికేయుడిని ఎస్పీ అభినందిస్తూ రివార్డులు అందజేశారు.

నమ్మించి మోసం చేశాడు

మమ్మల్ని నమ్మించి మోసగించాడు. రైల్వేలో ఉద్యోగమని నా దగ్గర రూ.50 వేల తీసుకొని చుట్టు పక్కల పిల్లలతో కలిపి అరకు తీసుకెళ్లాడు. అలా దగ్గరయ్యాడు. రైల్వేస్టేషన్లో జెండా ఊపే ఉద్యోగమని చెప్పాడు. ఉద్యోగం పనిపై అంటూ హైదరాబాద్ తీసుకెళ్లాడు. తర్వాత విజయవాడ వెళ్లాం. ప్రభుత్వ ఉద్యోగం వల్ల సిమ్ కూడా చెక్ చేస్తారని పట్టుకెళ్లాడు. తర్వాత ఆ సిమ్ వేసి రూ.2 లక్షలు పిల్లలకోసం అకౌంట్‌లో ఉన్న డబ్బులు తీసుకున్నాడు. ఇంటి నుంచి పిల్లలను తీసుకెళ్లేటప్పుడు బీరువాలోని రూ.30 వేలు నగదు, నా బంగారు వస్తువులు తీసుకెళ్లిపోయాడు. పోలీసులకు బాగానే స్పందించారు. వెతుకుతున్నామనే చెబుతుండడంతో నాకు భయం వేసింది. దీంతో మాకు తెలిసిన వాళ్ల సలహాతో పవన్‌కళ్యాణ్‌ని కలవడానికి పిఠాపురం వెళ్లాం. పోలీసులు వేగంగా వెళ్లకపోతే నా పిల్లలు దక్కేవాళ్లు కాదేమో. మేం వాడిని నమ్మి మోసపోయాం. పిల్లల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి.

\- బాలికల తల్లి

డ్రగ్స్‌తో జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 12: యువత మాదక ద్రవ్యాల వినియోగం వైపు ప్రభావితం కావొద్దని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల నియంత్రణపై మండలంలోని కాతేరు వ్యవసాయ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యార్థులు తెలిసిగాని, తెలియకగాని మాదక ద్రవ్యాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని, దాని వల్ల కలిగే దుష్పరిణామాలను ప్రతిఒక్కరికీ తెలిసేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. నేడు సమాజంలో సుమారు 70శాతం మంది ఆల్కాహాల్ తీసుకుంటున్నారని, ముఖ్యంగా యువత కొత్తదనం పట్ల ఆకర్షితులవుతున్నారని, ఒకసారి చేసి చూద్దామనే భావనలో వుండి ఆ దిశగా ప్రభావితులవుతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాలకు బానిసలుగా మారకుండా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్డీవో కేఎల్ జ్యోతి, ఐసీడీఎస్ పీడీ విజయలక్ష్మి, విజిలెన్స్ అదనపు ఎస్పీ సోమశేఖర్, కళాశాల అసోసియేట్ డీన్ శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1	మురారి
వై.స్క్రీన్2	తుఫాన్
దేవిశ్రీ(గాయత్రి	బడ్డీ
అనన్య	కమిటీ కుర్రోళ్లు
నిడదవోలు	
వీ మ్యాక్స్	కమిటీ కుర్రోళ్లు
రాధాకృష్ణ	రాయన్
శ్రీగణపతి	పురుషోత్తముడు
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	కమిటీ కుర్రోళ్లు
శ్రీరామ్ సినీ మ్యాక్స్	కమిటీ కుర్రోళ్లు
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	---
స్క్రీన్ 2	---
శ్రీనివాస	---